

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాలను అభివృద్ధి చేస్తూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైసిపి ఓర్వలేని తనంతో జరుగుతున్న సంక్షేమం అభివృద్ధిపై విష ప్రచారాన్ని చేస్తుంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 29.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 68 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలి

- పిల్లల పెంపకంలో తండ్రి బాధ్యత తీసుకోవాలి
- పరిస్థితులు మారాయి..ఇప్పుడు సంతానం భారం కాదు..సంపద!
- చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమంలో తల్లిదండ్రులతో సీఎం చంద్రబాబు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సీఎం క్యాంప్ కార్యాలయంలో పిల్లలకు పోలియో చుక్కలువేశారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లలను ఎత్తుకుని కొంతసేపు ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు చేసిన ఏర్పాట్లను కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో నేటి నుంచి మూడు రోజుల పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా 5 సంవత్సరాల లోపు ఉన్న సుమారు 49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు.

**ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలి:సీఎం :** వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లల తల్లిదండ్రులుతో సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా మాట్లాడారు.

మిగతా 2లో...

## డిజిటల్ హబ్‌గా ఏపీ!

2 లో

- సీఎం చంద్రబాబు-సునీల్ భారతి మిత్తల్ భేటీ
- డేటా సెంటర్లు, సముద్రగర్భ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుపై కీలక చర్చలు

## మామిడి రైతులకు అండగా నిలవండి

- కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి
- ధరల పతనంతో నష్టాల్లో తోతాపురి సాగుదారులు

2 లో

# అపోహలు సృష్టించొద్దు!



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్న స్మార్ట్ కిచెన్లపై కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాజకీయ స్వార్థంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలనే లక్ష్యంతోనే స్మార్ట్ కిచెన్ల విధానాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

స్మార్ట్ కిచెన్ల పేరుతో వంట కార్మికులను తొలగిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 85 వేల మంది కుక్-కమ్-హెల్పర్ల ఉపాధికి ఎలాంటి భంగం కలగదని, వారి సంక్షేమం,

మిగతా 2లో...

- స్మార్ట్ కిచెన్లపై తప్పుడు ప్రచారం మానుకోవాలి
- వంట కార్మికుల ఉపాధికి ఎలాంటి భంగం లేదు..
- విద్యార్థులకు నాణ్యమైన భోజనమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి నారా లోకేష్



## అమరావతిపై వైసీపీ ద్వంద్వ వైఖరి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఐదేళ్ల పాటు రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసిన వైసీపీ నేతలు ఇప్పుడు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. రాజధానిగా అమరావతిని అంగీకరించని వైసీపీ నేతలకు ఇప్పుడు అక్కడ పర్యటించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. ఆదివారం అమరావతిలో మంత్రి రాంప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రజల రాజధాని అమరావతిని అడ్డుకోవడం

మిగతా 2లో...

## 91.95% మంది చిన్నారులకు పోలియో చుక్కలు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా రాష్ట్రంలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమానికి మంచి స్పందన కనిపించింది. రాష్ట్ర వ్యాప్తంగా 0-5 ఏళ్ల లోపు వయసు కలిగిన చిన్నారులు 49,20,239 మంది ఉండగా వీరిలో 45,24,116 (91.95%) మందికి పోలియో చుక్కలు వేశారు. మిగిలిన వారి ఇళ్లకు వైద్య సిబ్బంది సోమ, మంగళవారాల్లో వెళ్లి.. చుక్కలు వేయనున్నారు. ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విశాఖలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా జరిగేందుకు వీలుగా వైద్య, ఆరోగ్య శాఖ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. పల్స్ పోలియో కార్యక్రమాలపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ముఖ్య కార్యదర్శి యస్. సురేష్‌కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ

మిగతా 2లో...



## మోదీకి సీషెల్స్ అత్యున్నత గౌరవం



- 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' పురస్కారం ప్రదానం
- పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధిలో కృషికి గుర్తింపు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాని మోదీకి మరో అరుదైన గౌరవ పురస్కారం లభించింది. సీషెల్స్ దేశ అత్యున్నత 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ ఆయనకు అవార్డు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, సుస్థిర అభివృద్ధి సాధించడంలో ప్రపంచ దేశాలకు నాయకత్వం వహిస్తున్నందుకుగానూ సీషెల్స్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది.

దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ సీషెల్స్ దేశ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్న భారత ప్రజలందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ఈ అవార్డును అత్యంత గౌరవంగా స్వీకరిస్తున్నా. వాతావరణ మార్పులతో సతమతమవుతూ, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న అన్ని దేశాల ప్రజలకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నా. అందరూ ఏకమై పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాల్సిన అవసరం ఉంది. మన గ్రహాన్ని మరింత పచ్చగా, సుస్థిరంగా మార్చేందుకు భారత్ సిద్ధంగా ఉంది. కానీ, అందుకు అన్ని దేశాలూ ముందుకు రావాలి. అప్పుడే అది సాధ్యపడుతుంది" అని మోదీ పేర్కొన్నారు.

మిగతా 2లో...

## రెండో భార్య కుమార్తెలకూ ఆస్తి హక్కు

- వంశపారంపర్య ఆస్తిలో సమాన వాటా ఉంటుందని హైకోర్టు కీలక తీర్పు
- మొదటి భార్య కుమారుడి అప్పీల్ కొట్టివేత


**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తిలో మొదటి భార్య కుమారుడితో సమానంగా రెండో భార్య కుమార్తెలకూ చట్టబద్ధమైన హక్కు ఉంటుందని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రెండో భార్యకు జన్మించిన కుమార్తెలు కూడా చట్టబద్ధ సంతానమేనని, వారికి పూర్వీకుల ఆస్తిలో సమాన హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు మొదటి భార్య కుమారుడు దాఖలు చేసిన రెండో అప్పీల్‌ను హైకోర్టు కొట్టివేసింది.

కాకినాడ మండలం గైగోలుపాడుకు చెందిన కుటుంబంలో వంశపారంపర్యంగా వచ్చిన ఇల్లు, ఖాళీ స్థలంలో తమకు వాటా కల్పించాలని

2 లో..



## స్కైడైవింగ్ యాత్ర విషాదం



- ఫ్రాన్స్‌లో మినీ విమానం కూలి పైలట్ సహా 11 మంది మృతి
- ఘటనపై దర్యాప్తు ప్రారంభం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఫ్రాన్స్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఓ మినీ విమానం కుప్పకూలిన ఘటనలో 11మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన తాంబ్లైన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల మేరకు.. ఆదివారం ఉదయం ఓ మినీ విమానం 11 మంది ప్రయాణికులతో నాన్సీ-ఎసే ఎయిర్‌ఫీల్డ్ నుంచి స్కైడైవింగ్ కోసం బయలుదేరింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం సుమారు 11:00 గంటల సమయంలో తాంబ్లైన్‌లో నివాస ప్రాంతానికి సమీపంలో కుప్పకూలింది.

దీంతో పైలట్ సహా మొత్తం 11 మంది ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పెద్ద సంఖ్యలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు మొదలెట్టారు. విమానం ముక్కలై పడిపోవడం వల్ల.. అక్కడ పేలుడు సంభవించే అవకాశం ఉందని అధికారులు భావించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సమీపంలోని రోడ్లను మూసివేశారు. స్థానికులు ఎవరూ ఆ ప్రాంతానికి రావద్దని పోలీసులు హెచ్చరించారు. కాగా, విమానం కుప్పకూలడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## ఉండవల్లి ఘటనలో అంబటి, పేర్నిపై అట్రాసిటీ కేసు

- వైసీపీ పర్యటన ఉద్రిక్తతలపై మూడు కేసులు నమోదు
- పోలీసు అధికారిని తోసిన ఘటనపై అంబటి రాంబాబుపై మరో కేసు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతి పరిధిలోని ఉండవల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బృందం పర్యటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ ఘర్షణలపై తాడేపల్లి పోలీసులకు అందిన వేర్వేరు ఫిర్యాదుల మేరకు మూడు కేసులు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. పెనుమాకకు చెందిన మాణిక్యం అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని సహా వైసీపీ నాయకులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వైసీపీ నేతల పర్యటన సమయంలో విధుల్లో పోలీస్ అధికారిని నెట్టివేసినందుకు అంబటి రాంబాబుపై సీఐ వీరేంద్రబాబు స్వయంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అంబటిపై పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 కింద కేసు నమోదయింది. వైసీపీ నేత నారాయణమూర్తి కారు అద్దం పగలగొట్టిన ఘటనపై ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు.. రైతులు, టీడీపీ నేతలపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

ఉండవల్లిలో తలెత్తిన ఉద్రిక్తలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పర్యటన విధుల్లో ఉన్న కానిస్టేబుల్ పై దాడిచేసిన బ్యాచ్ పైనే పోలీసులకు అనుమానాలు బలపడుతున్నాయి. తొలుత కొందరు వ్యక్తులు రాళ్లదాడి చేసి.. ఉద్దేశపూర్వకంగానే రైతుల్ని రెచ్చగొట్టారన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అంతేకాక.. గతంలో టీడీపీ ఆఫీసుపై దాడిచేసిన ఘటనలో నిందితుడిగా ఉన్న చైతన్య అనే వ్యక్తి.. నిన్నటి గొడవలో వైసీపీ నేతల వెంట ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఉద్రిక్తతలకు కారణమైన వారందరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, పూర్తిస్థాయి ఆధారాలతో దర్యాప్తు ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు.

## ప్రజా తిరుగుబాటుతో వైసీపీ తోక ముడిచింది

- కుట్రల రాజకీయాలను మహిళలు, రైతులే తిప్పికొట్టారు
- నేర రాజకీయాలను ప్రభుత్వం ఉపేక్షించదు
- మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** శనివారం అమరావతిలో జరిగిన ప్రజా తిరుగుబాటుతో వైసీపీ అల్లరి మూకలు తోక ముడిచాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. కుట్రల ముసుగులో మరోసారి ప్రజలను మోసం చేయాలని ప్రయత్నించిన వైసీపీ నేతలను అమరావతి మహిళలు, రైతులు గట్టిగా నిలదీసి వెనక్కి పంపారని పేర్కొన్నారు. రాజకీయాల పేరుతో నేరాలకు పాల్పడే వారిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా అదే స్పష్టతతో ఉన్నారనడానికి శనివారం నాడు అమరావతలో జరిగిన ఘటనే నిదర్శనమని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో మూడు రాజధానుల పేరుతో ప్రచారం చేసిన వైసీపీ ప్రభుత్వం ఎక్కడా గుప్పెడు మట్టి కూడా పోయలేదని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విమర్శించారు. విధ్వంసకర విధానాలతో అమరావతితో పాటు రాష్ట్ర అభివృద్ధినే దెబ్బతీశారని ఆరోపించారు. అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ నాయకత్వం ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొత్త కొత్త నాటకాలకు తెరలేపుతోందని అన్నారు. ఏ అంశం పైనా స్థిరమైన వైఖరి లేకుండా ప్రజలను మభ్యపెట్టడమే ఆ పార్టీ లక్ష్యంగా మారిందని అన్నారు. ఇదే ధోరణి కొనసాగిస్తే రాష్ట్ర ప్రజల్లో వైసీపీకి మిగిలిన విశ్వాసం కూడా పూర్తిగా కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అమరావతిలో మహిళలు, రైతులు వ్యక్తం చేసిన నిరసన ప్రజల మనోభావాలకు అద్దం పట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అభివృద్ధి, శాంతి భద్రతలకు కాపాడమే లక్ష్యంగా పనిచేస్తుందని, ప్రజాస్వామ్యాన్ని అడ్డుపెట్టుకుని అల్లర్లు సృష్టించే ప్రయత్నాలను సహించబోదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

# అమరావతిపై వైసీపీ ద్వంద్వ వైఖరి

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ రాజకీయ అజెండాగా మారిందని అన్నారు. అభివృద్ధి కోసం కాదు, అలజడి సృష్టించడం కోసమే వైసీపీ నేతలు అమరావతిలో పర్యటిస్తున్నారని విమర్శించారు.

నిర్మాణాలు జరిగే ప్రాంతంలో ఘర్షణలకు కారణం వైసీపీ నేతల రెచ్చగొట్టే వైఖరే అని మంత్రి రాంప్రసాద్ పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధిని ప్రజలు స్వాగతిస్తుంటే.. వైసీపీ మాత్రం అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై వైసీపీ ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ నేతలు అమరావతి వేదికగా మరో డ్రామా ప్రారంభించారని ఆరోపించారు.

కూటమి ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉందని రవాణా శాఖ మంత్రి పునరుద్ఘాటించారు. ఎలాంటి కుట్రలు చేసినా రాజధాని అమరావతి నిర్మాణాన్ని ఆపలేరని వైసీపీ నేతలకు స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలను ప్రజలు స్వాగతించారని.. ఈ విషయాన్ని గ్రహించాలంటూ వైసీపీ నేతలకు మంత్రి రాంప్రసాద్ సూచించారు.

# రెండో భార్య కుమార్తెలకూ ఆస్తి హక్కు

(మొదటి పేజీ తరువాయి)

తండ్రి తురంగి సోమరాజుతో పాటు రెండో భార్యకు జన్మించిన ఆరుగురు కుమార్తెలు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో మొదటి భార్య కుమారుడు సత్యనారాయణను ప్రతివాదిగా చేర్చారు. తొలుత దావా తిరస్కరణకు గురికాగా, అప్పీల్‌లో అదనపు జిల్లా కోర్టు సోమరాజు, సత్యనారాయణ, ఆరుగురు కుమార్తెలు ఆస్తిలో సమాన హక్కుదారులని తీర్పు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు.

విచారణ సందర్భంగా తన తండ్రి రెండో వివాహం చేసుకోలేదని, రాఘవ అనే మహిళతో వివాహేతర సంబంధం మాత్రమే ఉందని, ఆమె కుమార్తెలకు ఆస్తిపై హక్కు లేదని సత్యనారాయణ వాదించారు. అయితే, మొదటి భార్య మరణించిన అనంతరం రాఘవను వివాహం చేసుకున్నానని, ఆమెకు జన్మించిన ఆరుగురు కుమార్తెలు తన చట్టబద్ధ సంతానమేనని సోమరాజు కోర్టుకు వివరించారు.

ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు, ఆస్తి సోమరాజు తండ్రికి చెందిన వంశపారంపర్య ఆస్తి అని పేర్కొన్నారు. అలాంటి ఆస్తిలో మొదటి భార్య కుమారుడితో పాటు రెండో భార్యకు జన్మించిన కుమార్తెలు కూడా సమాన వాటాదారులేనని స్పష్టం చేశారు. తండ్రి రూ. 80 వేల తీసుకుని తన హక్కును వదులుకున్నారని చేసిన వాదనకు ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని పేర్కొంటూ, ఒకవేళ తండ్రి తన హక్కును వదులుకున్నా అది తన వాటా వరకే పరిమితమని, కుమార్తెల హక్కులను ప్రభావితం చేయదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. దీంతో దిగువ కోర్టు తీర్పును సమర్థిస్తూ సత్యనారాయణ దాఖలు చేసిన రెండో అప్పీల్‌ను కొట్టివేసింది.

# డిజిటల్ హబ్‌గా ఏపీ!




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్రంలో డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సాంకేతిక మౌలిక సదుపాయాల విస్తరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో ఆదివారం సమావేశమయ్యారు. అమరావతిలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాలకు లాస్ట్-మైల్ ఇంటర్నెట్ సేవలను విస్తరించే అంశాలపై ప్రధానంగా చర్చించారు.

సమావేశంలో రాష్ట్రంలో మొబైల్ టవర్ కనెక్టివిటీ పెంపు, డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలు, సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటు వంటి కీలక అంశాలపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు. మొబైల్ సేవల సంస్థలకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత మెరుగుపరిచే చర్యలపై కూడా చర్చించినట్లు తెలిసింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన ఇంటర్నెట్, మెరుగైన కమ్యూనికేషన్ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశం రాష్ట్రంలో డిజిటల్ రంగ అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు దోహదపడే కీలక అడుగుగా అధికారులు భావిస్తున్నారు.

# మామిడి రైతులకు అండగా నిలవండి




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్రంలోని తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని అధిగమించేందుకు చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం లేఖ రాశారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం-ఞాణూూ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అంతర్జాతీయ పరిణామాలతో మ్యాంగో పల్ప్ ఎగుమతులు నిలిచిపోవడం, పరిశ్రమలు కొనుగోళ్లు నిలిపివేయడంతో మార్కెట్‌లో తోతాపురి ధరలు పడిపోయాయని లేఖలో పేర్కొన్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు కేంద్రం రూ. 281 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి ఆ లేఖలో కోరారు. దేశంలోనే మామిడి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని, రాష్ట్రవ్యాప్తంగా 3.99 లక్షల హెక్టార్లలో సాగవుతూ 52.65 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల్లో దాదాపు 91,011 హెక్టార్లలో తోతాపురి రకం సాగవుతోందని తెలిపారు. దీని ద్వారా 8.65 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తూ లక్షలాది రైతు కుటుంబాలకు జీవనాధారంగా ఉందని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత సీజన్‌లో పెట్టుబడి వ్యయం పెరగడం, మార్కెట్ ధరలు కుప్పకూలడంతో మామిడి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని లేఖలో పరిస్థితిని వివరించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని 7.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కొనుగోళ్లకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం అమలు చేస్తున్నట్టు సీఎం లేఖలో వెల్లడించారు. దీంట్లో భాగంగా కిలోకు అదనంగా రూ. 4 చొప్పున మామిడి రైతులకు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకుఞాణూూ కింద కేంద్రం మద్దతివ్వాలని... ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు జరిగే ఈ కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీంను అమలు చేసేలా చూడాలని కేంద్రమంత్రికి రాసిన లేఖలో ముఖ్యమంత్రి కోరారు.

# ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలి



(మొదటి పేజీ తరువాయి)

పిల్లల పెంపకం భారంగా ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగానికి, ఉపాధికి వెళుతున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగారు. ఇంట్లో భర్త, మగవాళ్లు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం అన్నారు. పిల్లల్ని కని, పెంచడం, వారి అలనాపాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదని అన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో భాగస్వాములు అయ్యేవారని అన్నారు. పిల్లలను విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని..... అలాంటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలని...సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని సీఎం అన్నారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామని సీఎం అన్నారు. ఈ విషయంలో ముందుగా తల్లిదండ్రులకు అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, సెకండరీ హెల్త్‌డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబుతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్షయపాత్రకు 'రోటరీ' అద్వితీయ పాత్ర

- **'అన్నపూర్ణ' పేరిట స్ఫూర్తిదాయక సర్వీసు ప్రాజెక్టు**
- **హెచ్ కెఎంసీఎఫ్ కు రూ.1.46కోట్ల విలువైన సామగ్రి అందజేత**
- **హాజరైన డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్, రోటరీ దిగ్గజ ప్రతినిధులు**
- **మంగళగిరి రోటరీ క్లబ్ కు ప్రశంసలు**




**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అన్నపూర్ణ' ప్రాజెక్టును విజయవంతంగా పూర్తిచేసింది. ఈ మేరకు మంగళగిరి నగర సమీపంలోని అక్షయపాత్ర క్యాంపస్ లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 ఆధ్వర్యంలో అన్నపూర్ణ ప్రాజెక్టులో భాగంగా రూ 1.46కోట్ల విలువైన అధునాతన కిచెన్ పరికరాలు, అన్నక్యాంటీన్లకు, పప్రభుత్వ పాఠశాలలకు ఆహారం పంపిణీచేసే రెండు వాహనాలను హరేకృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ కు లాంఛనంగా అందజేసింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ డాక్టర్ ఎస్.వి.రాంప్రసాద్, ఐపీడీజీ శరత్ చౌదరి కె, డీజీఈ ఉదయ సుధీర్ పిలాని, హరేకృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ మంగళగిరి వైస్ ప్రెసిడెంట్ విలాస విగ్రహ దాస, అన్నపూర్ణ సర్వీసు ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ రవి వడ్లమాని, పీడీజీలు తాళ్ల రాజశేఖర్ రెడ్డి, అన్నె రత్నప్రభాకర, అన్నపూర్ణ సర్వీసు ప్రాజెక్టు చైర్మన్, మంగళగిరి రోటరీ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి ఇసునూరు, అసిస్టెంట్ గవర్నర్ ఈవీ పూర్ణచంద్, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రెగడ రాజశేఖర్, నిరంజన్ గుప్తా పారేపల్లి, అసిస్టెంట్ గవర్నర్ ఎలెక్ట్ గాజుల శ్రీనివాసరావు, మంగళగిరి, తాడేపల్లి తదితర రోటరీ క్లబ్ ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ పరికరాల వలన ప్రతిరోజూ 25000 భోజనాలను అదనంగా అందించ వచ్చని హరేకృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ట్రస్టు మంగళగిరి వైస్ ప్రెసిడెంట్ విలాస విగ్రహ దాస సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రోటరీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 ఆధ్వర్యంలో అన్నపూర్ణ పేరిట ప్రతిష్టాత్మకమైన సర్వీసు ప్రాజెక్టు ద్వారా హరేకృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ట్రస్టుకు మిషనరీ, ఎక్విప్ మెంట్ అందించడం తమకెంతో గర్వకారణంగానూ, సంతోషంగానూ ఉందని ఆర్ఐడీ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.రాంప్రసాద్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు విస్తరించివున్న రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 కింద 100 రోటరీ క్లబ్ లు, సుమారు 4వేల మంది రొటేరియన్లు ఈ బృహత్తర సర్వీసు ప్రాజెక్టులో భాగం కావడంపై ప్రాజెక్టు అన్నపూర్ణ కన్వీనర్, ఆర్ఐడీ 3150 సర్వీసు ప్రాజెక్ట్స్ డిస్ట్రిక్ట్ చైర్ పీడీజీ డాక్టర్ రవి వడ్లమాని హర్షం వ్యక్తంచేశారు. అత్యంత ప్రతిష్టాత్మక సర్వీసు ప్రాజెక్టు 'అన్నపూర్ణ'ను విజయవంతంగా నిర్వహించడంలో ఈ ప్రాజెక్టు చైర్మన్ అనిల్ చక్రవర్తిని మరియు మంగళగిరి రోటరీ క్లబ్ సభ్యులను అభినందించారు.

# ఆర్టీసీ పరిరక్షణకు రెండో దశ ఉద్యమ షెడ్యూల్ ప్రకటించిన జేఏసీ

- **జూలై 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనల**
  **విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్**

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** విద్యుత్ బస్సుల నిర్వహణ పేరుతో ప్రైవేటు ఆపరేటర్లకు అవకాశాలు కల్పిస్తూ, ఆర్టీసీ డిపోల స్థలాలను లీజు పేరుతో అప్పగించే విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఏపీపీటీడీ (ఏపీఎస్ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ప్రజారవాణా వ్యవస్థ పరిరక్షణ, ఆర్టీసీ సంస్థ బలోపేతం, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టనున్న రెండో దశ ఉద్యమ కార్యక్రమాల షెడ్యూల్‌ను ఆదివారం విజయవాడలో జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు ప్రకటించారు.

రెవెన్యూ భవన్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు జూలైలో పలు దశల్లో ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వం, యాజమాన్యానికి ఇప్పటికే వినతిపత్రాలు సమర్పించి, శాంతియుతంగా ఆందోళనలు చేపట్టినా ఎలాంటి స్పందన లేకపోవడంతో రెండో దశ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం రానున్న 1,050 విద్యుత్ బస్సుల కోసం నాలుగు డిపోలను పూర్తిగా, మరో ఎనిమిది డిపోల్లో సగం స్థలాన్ని ప్రైవేటు ఆపరేటర్లకు కేటాయించారని ఆరోపించారు. భవిష్యత్తులో మరో 1,450 విద్యుత్ బస్సుల కోసం 29 డిపోలను కూడా ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీంతో దశలవారీగా ఆర్టీసీని ప్రైవేటీకరించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు.

జేఏసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూలై 7, 8 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 'ఏపీఎస్ ఆర్టీసీ పరిరక్షణ దినాలు' నిర్వహించి ఉద్యోగులు డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించనున్నారు. జూలై 9 నుంచి 18 వరకు ప్రజాప్రతినిధులను కలిసి మద్దతు కోరనున్నారు. జూలై 19 నుంచి 26 వరకు ముఖ్యమంత్రికి పంపే వినతిపత్రాలపై ఉద్యోగుల సంతకాల సేకరణ చేపట్టనున్నారు. జూలై 27న గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ల ద్వారా సంతకాలతో కూడిన వినతిపత్రాలను ముఖ్యమంత్రికి అందజేయనున్నారు. అనంతరం జూలై 30న విజయవాడలో జేఏసీ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించి మూడో దశ ఉద్యమ కార్యాచరణను ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

ఆర్టీసీ పరిరక్షణ కోసం చేపట్టే ఉద్యమ కార్యక్రమాలకు అన్ని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, అన్ని కేటగిరీల ఉద్యోగులు మద్దతు తెలపాలని జేఏసీ కో-కన్వీనర్లు పి.వి. రమణారెడ్డి, జి.వి. నరసయ్య, సి. హెచ్. సుందరయ్య, ఎస్.వి. శేషగిరిరావు, వై. శ్రీనివాసరావు, కె. సూర్యప్రకాశ్ రావు, డి. మాల్యాద్రి పిలుపునిచ్చారు.

# ఆఖిరి విజయం అమరావతి దే

- **చివరి లీగ్ మ్యాచ్లో అమరావతి అద్భుత విజయం**
- **మరోసారి ఆల్ రౌండ్ ప్రదర్శనతో సట్టా చాటిన అమరావతి**
- **ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎస్ వి రాహుల్**
- **ప్లే ఆఫ్స్ కు చేరిన 4 జట్లు**




**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి(ఏ సి ఏ స్టేడియం) ఏపీఎల్ 2026 సీజన్ 5 లో భాగంగా మంగళగిరి వేదికగా నాలుగో రోజు రెండవ మ్యాచ్లో క్యాపిటల్ అమరావతి రాయల్స్ మరియు రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్లు తెలపడ్డాయి మొదటిగా టాస్ గెలిచిన అమరావతి రాయల్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది

మొదట బ్యాటింగ్కు దిగిన అమరావతి జట్టుకు ఓపెనర్లు తొలి వికెట్ కు 51 పరుగులు జోడించి శుభారంబాని అందించారు ఆ తర్వాత వెంట వెంటనే వికెట్లు పడడంతో అమరావతి జట్టు మిడిల్ ఓవర్స్ లో కొంత పరుగులు తీయడంలో వెనకంజ వేసింది అలాంటి సమయంలో ఎస్ వి రాహుల్ 43 బంతుల్లో 70 పరుగులు 5 ఫోర్లు 4 సిక్సర్ల తో టీం స్కోర్ లో కీలక పాత్ర పోషించాడు రాహుల్ కు సహకారంగా వరుణ్ సాత్విక్ 19 బంతుల్లో 34 పరుగులు 1 ఫోర్3 సిక్సర్స్ తో చివర్లో మంచి ఇన్నింగ్స్ ఆడాడు దీంతో 20 ఓవర్లు ముగిసే సమయానికి ఆరు వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది అమరావతి జట్టు రాయలసీమ బౌలర్లలో వాసు రెండు వికెట్లు పడగొట్టాడు

అనంతరం బ్యాటింగ్కు దిగిన రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టుకు ఆది నుంచి కష్టాలు మొదలయ్యాయి జట్టు లో కీలక బ్యాటర్లంతా పెవిలియన్కు వచ్చిన వారు వచ్చినట్టుగా క్యూ కట్టారు దీంతో మిడిల్ ఆర్డర్ బ్యాటర్ విష్ణు దత్త 34 బంతుల్లో 45 పరుగులు 3 ఫోర్లు 1 సిక్స్ మరియు కార్తీక్ రామన్ 15 పంతులు 29 పరుగులు 4సిక్సర్స్ చివర్లో పోరాడిన ఫలితం లేకుండా పోయింది మిడిల్ ఓవర్స్ లో పరుగులు చేయకుండా వికెట్లు కోల్పోవడంతో లక్ష్యం ఒకసారిగా పెరిగిపోయింది దీంతో 20 ఓవర్లలో కేవలం 137 పరుగులకే రాయలసీమ జట్టు ఆలౌట్ అయింది అమరావతి బౌలర్లలో ఏరా సందీప్ 4 వికెట్లు టోషిత్ యాదవ్,వర్మ రెండేసి వికెట్లు పడగొట్టారు ఈ మ్యాచ్ తో ఏపీలో 2026 సీజన్ 5 లీగ్ మ్యాచ్ లన్ని పూర్తయ్యాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎస్ వి రాహుల్ ఎంపికయ్యాడు

**ప్లే ఆఫ్స్ కు చేరిన నాలుగు టీంలు**

పాయింట్స్ టేబుల్ లో అగ్రగామిగా ఉన్న అమరావతి రాయల్స్ భీమవరం బుల్స్ సింహాద్రి వైజాగ్ లయన్స్ విజయవాడ సన్ షైనర్స్ జట్లు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించాయి

# మోదీకి సీషెల్స్ అత్యున్నత గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణ పరిరక్షణ అంశంలో ప్రధాని మోదీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఇదే తొలిసారి కాదు. ఆహార భద్రత, వ్యవసాయంలో తీసుకొస్తున్న మార్పులు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాల్లో ఆయన చేసిన కృషికి గానూ మే 2026లో ప్రపంచ వ్యవసాయ, ఆహార సంస్థ (ఎఫ్ఏఓ) ఆయనకు 'అగ్రికోలా మెడల్'ను బహూకరించింది. 2018లో సుస్థిర ఆర్థికాభివృద్ధి, ప్రపంచ సహకారం, సమ్మిళిత అభివృద్ధి రంగాల్లో ఆయన సేవలకుగానూ సియోల్ శాంతి బహుమతి వరించింది. అదే ఏడాది ఐక్యరాజ్యసమితి.. 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్' అవార్డుతో సత్కరించింది.

# 91.95% మంది చిన్నారులకు పోలియో చుక్కలు



(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ చక్రధర్ బాబు సమీక్షల ద్వారా జిల్లాల్లో అధికార యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేశారు. దీనివల్లే.. పోలియో చుక్కల పంపిణీకి మంచి స్పందన కనిపించింది. ఎన్టీఆర్, మార్కాపురం, కృష్ణా జిల్లాల్లో చుక్కలు వేయించుకున్న వారి శాతం 115.16%, 113.21%, 104.29% చొప్పున నమోదైంది.

పల్నాడు జిల్లాలో 98.06%, అనకాపల్లి జిల్లాలో 97.93% నమోదైందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. తక్కువగా కర్నూలు జిల్లాలో 73.58%, అన్నమయ్య జిల్లాలో 79. 90%, నంద్యాల జిల్లాలో 80.91% చొప్పున చుక్కల పంపిణీ జరిగిందని మంత్రి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమాల్లో క్షేత్రస్థాయిలో 1.31 లక్షల మంది సిబ్బంది పాల్గొన్నారని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు తెలిపారు. నిర్దేశిత కేంద్రాల్లో ఆదివారం ఉదయం నుంచే చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ మొదలైంది. జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29,873 పల్స్ పోలియో బూత్ లను ఏర్పాటుచేశారు. 1,757 మొబైల్ బృందాలు, 1,144 ట్రాన్సిట్ బూత్ లను ఏర్పాటు చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన 68.68 లక్షల పోలియో టీకా డోసుల్ని జిల్లాలకు పంపించారు.

# అపోహలు సృష్టించొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం పూర్తి హామీ ఇస్తోందని పేర్కొన్నారు. కార్మికుల జీవనోపాధికి ఇబ్బంది కలిగించే ఆలోచన ప్రభుత్వానికి లేదని వెల్లడించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఈ ఏడాది ఏప్రిల్ వరకు గౌరవ వేతనాలు పూర్తిగా చెల్లించామని, సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న స్వల్ప బకాయిలను కూడా త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్నసుమారు రూ. 350కోట్ల బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు.

వైఎస్సార్ కడప జిల్లాలో ఐదు స్మార్ట్ కిచెన్లను పైలట్ ప్రాజెక్టుగా విజయవంతంగా నిర్వహిస్తున్నామని, వాటి పరిధిలో పనిచేస్తున్న 233 మంది కుక్-కమ్-హెల్పర్లు యథావిధిగా విధులు నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న మరో 33 స్మార్ట్ కిచెన్ల వల్ల కూడా ఎవరూ ఉద్యోగాలు కోల్పోరని, స్వయం సహాయక సంఘాల మహిళలకు హెడ్ కుక్స్, అసిస్టెంట్ కుక్స్, హెల్పర్లు, డ్రైవర్లుగా అదనపు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ కిచెన్ల విస్తరణతో విద్యార్థులకు రుచి, శుచి, నాణ్యతతో కూడిన భోజనం అందించడంతో పాటు వేలాది మందికి అదనపు ఉపాధి కల్పించనున్నామని లోకేష్ తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేయకుండా ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని ఆయన కోరారు.

# పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటుచేసిన పోలియో చుక్కల కేంద్రం వద్ద మెడికల్ స్టాఫ్ తో కలసి అవసరమైన పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్, ఐ పి పి ఈదర శ్రీనివాసరావు, సెక్రటరీ ఎలెక్ట్ కొల్లి రాజేంద్రప్రసాద్, సెక్రటరీ నామిని మల్లాది అర్జున్, ఉన్నవ సూర్యనారాయణ, ఆలపాటి కిరణ్ చౌదరి, ఏఎన్ఎం, జి ఎన్ ఎం లు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు చిన్నచూపు చూస్తున్నారు.. హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అధికారులు చిన్నచూపు చూస్తున్నారు అంటూ ఏపీలో హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతపురంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసనాయక్ పోలీస్ వాహనాలకు అధికారులు నిధులు ఇవ్వడంలేదని ఆరోపిస్తూ సెల్ఫీ వీడియో తీసుకున్నారు. తనను చిన్నచూపు చూస్తున్నారంటే కత్తితో ఛాతీపై పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. రిపేర్ల కోసం తాను తన తల్లి హుండీ నుండి డబ్బులు వాడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కానిస్టేబుల్ పరిస్థితి నిలకడగానే ఉంది.

ఒక వాహనం రిపేర్ వస్తే 20వేలు ఖర్చు చేశానని, మరో యాక్సిడెంట్ అయితే 60వేలు పెట్టుకున్నానని చెప్పాడు. ఇంట్లో గొడవలు అవుతున్నాయని, డబ్బులు ఎక్కడ ఉన్నాయని అడుతున్నారని తెలిపాడు. అందుకే ఆత్మహత్య చేసుకునేందుకు పొడుచుకున్నట్టు చూపించాడు. మంచితనం ఎక్కడ ఉంది అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో అతడిని వేధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి అంటూ నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

# సాంకేతికతకు మానవీయ విలువలు తోడైనప్పుడే నిజమైన ప్రగతి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):**"ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ ఐ ), డేటా సైన్స్, 'వైబ్ కోడింగ్', 'ఏజెంటిక్ ఏఐ' వంటి సరికొత్త సాంకేతికతలు ప్రపంచాన్ని శాసిస్తున్న ప్రస్తుత తరుణంలో, టెక్నాలజీ ఎంత పెరిగినా మానవీయ విలువలు లేకపోతే లాభం లేదు. సాంకేతికతకు సంస్కారం తోడైనప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది" అని భారత గౌరవ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ (వి వి ఐ టి యు ) శనివారం నిర్వహించిన స్నాతకోత్సవ (కన్వకేషన్ )వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.




ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, విద్య అనేది కేవలం జీవనోపాధి కోసం మాత్రమే కాదని, అది సంస్కారాన్ని పెంచి, సమాజం పట్ల బాధ్యత గల పరిపూర్ణమైన మానవుడిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రపంచం రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-ఇరాన్ సంఘర్షణల వంటి భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలతో కొట్టుమిట్టాడుతూ, ఆర్థిక మందగమనాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, భారతదేశం మాత్రం అద్భుతమైన స్థిరత్వాన్ని ప్రదర్శిస్తోందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 7.6%గా నమోదై, ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా దూసుకుపోతోందని ప్రపంచ బ్యాంక్ గణాంకాలను గుర్తుచేశారు.

ప్రస్తుతం ప్రపంచ దేశాలు 'చైనా ప్లస్ వన్' వ్యూహాన్ని అనుసరిస్తూ భారత్‌ను అత్యంత నమ్మకమైన ప్రత్యామ్నాయంగా చూస్తున్నాయన్నారు. ఒకప్పుడు 'ఐటీ బ్యాక్ ఆఫీస్'గా ఉన్న భారత్, నేడు గ్లోబల్ టెక్ దిగ్గజం 'యాపిల్' తన ప్రపంచ ఐఫోన్ ఉత్పత్తిలో 25% ఇక్కడే తయారు చేసే స్థాయికి చేరిందని, అలాగే ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో 46% వాటాతో దేశం మొదటి స్థానంలో నిలిచిందని గర్వంగా ప్రకటించారు.

భారతదేశంలో 65 శాతం మంది 35 ఏళ్ల లోపు యువకులే ఉన్నారని, రాబోయే రెండు దశాబ్దాల పాటు ప్రపంచానికి అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించగల ఏకైక దేశం మనదేనన్నారు. యువతరం కేవలం ఉద్యోగాలు వెతుక్కునే వారుగా కాకుండా, పదిమందికి ఉపాధినిచ్చే 'ఉద్యోగ సృష్టికర్తలుగా' మారాలని, స్టార్టప్ ఆవిష్కరణలకు పదును పెట్టాలని సూచించారు. వాతావరణ మార్పులు, ఎల్ నినో వంటి సవాళ్లకు మరియు 2070 నాటికి 'నెట్ జీరో' ఉద్గారాల లక్ష్య సాధనకు హైడ్రోజన్ ఇంధనం వంటి సుస్థిర ఇంధన వనరుల అభివృద్ధిపై యువత పరిశోధనలు చేయాలన్నారు. విద్యార్థులు జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా, ఏ దేశానికి వెళ్లినా కన్నతల్లిని, జన్మభూమిని, మాతృదేశాన్ని, మాతృభాషను మరియు గురువులను మరిచిపోకూడదని హితవు పలికారు. అలాగే, నేటి యువత ఫాస్ట్ ఫుడ్‌ను పరిహరించి, భారతీయ సాంప్రదాయ వంటకాలను అలవర్చుకోవాలని, సూర్యోదయానికి ముందే నిద్రలేస్తూ రోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. యువతరం భారతీయ కుటుంబ వ్యవస్థ పై నమ్మకం ఉంచి విలువలతో కూడిన జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు.

విశ్వవిద్యాలయంలో ఎన్విడియా డీప్ లెర్నింగ్ ల్యాబ్, గూగుల్ కోడ్ ల్యాబ్, సీమెన్స్ సెంటర్ ఆఫ్ వంటి అంతర్జాతీయ స్థాయి పరిశోధనా వేదికలను, జర్మనీ, అమెరికా విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలను కుదుర్చుకోవడం పట్ల యాజమాన్యాన్ని అభినందించారు. నాడు ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి కేంద్రంగా నిలిచిన అమరావతి రాజధాని ప్రాంతంలో, 2007లో ఇంజనీరింగ్ కాలేజీగా ప్రారంభమై, నేడు 'వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ (వి వి ఐ టి యు )'గా రూపాంతరం చెందడం ఈ సంస్థ నిరంతర కృషికి నిదర్శనమన్నారు. యూనివర్సిటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ విద్యా నిబద్ధత, ప్రో-ఛాన్స్ లర్ వాసిరెడ్డి మహాదేవ్ అంతర్జాతీయ సాంకేతిక దార్శనికత అభినందనీయమన్నారు.

## పల్స్ పోలియో విజయవంతానికి 'ఏపీ హంసా' కృషి



**గన్నవరం (జర్నలిస్ట్ ఫైల్):** గన్నవరంలో 'ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్' (ఏపీ హంసా ) అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవానంద్ నాయకత్వం వహించగా, చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

## 2025 ఎంప్లాయిస్ యాక్ట్ అమలులో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రాధాన్యత కల్పించాలి



- **అపాయింట్‌మెంట్ తేదీనే సీనియారిటీకి ప్రాతిపదికగా పరిగణించాలి: సామల సింహాచలం**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** 2025 ఎంప్లాయిస్ యాక్ట్ ప్రకారం రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అధికారులను జిల్లాలకు కేటాయించే ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎంఈఓ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాల వారీగా ఉద్యోగుల కేటాయింపులో ప్రస్తుతం అమలులో ఉన్న కేడర్ సీనియారిటీకి బదులుగా ఉద్యోగంలో చేరిన తేదీ (అపాయింట్‌మెంట్ సీనియారిటీ)ని ప్రాతిపదికగా తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేడర్ సీనియారిటీ ఆధారంగా విభజన చేపడితే అనేక మంది సీనియర్ ఉద్యోగులు నష్టపోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

2025 ఏపీ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఉత్తర్వుల అమలులో ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సామల సింహాచలం కోరారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని ఉద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## ఏపీ మోడల్ స్కూల్స్ పీజీటీలకు జేఎల్ పదోన్నతులు కల్పించాలి



- **పెండింగ్ ప్రతిపాదనలను వెంటనే ప్రభుత్వానికి పంపించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి ఎంఎస్‌పీటీఏ వినతి**

**పులివెందుల(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లకు (పీజీటీలు) జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులు సృష్టించి పదోన్నతులు కల్పించాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ (ఎంఎస్‌పీటీఏ) ప్రభుత్వాన్ని కోరింది. అలాగే టీజీటీ హిందీ పోస్టును పీజీటీ హిందీ పోస్టుగా ఉన్నతీకరించాలని సంఘం డిమాండ్ చేసింది.

ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను తక్షణమే ప్రభుత్వానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పులివెందులలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని కలిసి సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఎంఎస్‌పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

వినతిపై స్పందించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, త్వరలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి పెండింగ్ ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలనకు వెంటనే పంపించేలా చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు శివశంకర్ రెడ్డి వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పీజీటీలు కె. నిత్య పూజయ్య, పి. సుధాకర్, కె. చంద్రశేఖర్ రెడ్డి, రామలింగారెడ్డి, నాగరాజు, నాగ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)కు టోల్ ఫ్రీ నంబర్ 1100 ను ప్రభుత్వం కేటాయించిందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పి.జి.ఆర్.ఎస్ తో పాటు రెవెన్యూ క్లినిక్ లను నిర్వహిస్తున్నామని, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

మీకోసం వెబ్ సైట్ మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

- **నిడదవోలు జనసేన నాయకులతో కలిసి తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శనం**
- **రాష్ట్ర భవిష్యత్ కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి సఫలీకృతం కావాలని, ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమైన అమరావతి నిర్మాణం వేగంగా పూర్తికావాలని శ్రీవారిని కోరుకున్నా: మంత్రి దుర్గేష్**
- **సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఏపీ సుభిక్షంగా ఉండాలి: రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్**
- **ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 'చాతుర్మాస దీక్ష' దిగ్విజయం కావాలని ప్రార్థించిన మంత్రి దుర్గేష్**



**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్):** సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాలలోనూ అగ్రగామిగా దూసుకుపోవాలని ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఆదివారం నిడదవోలు నియోజకవర్గ జనసేన నేతలతో కలిసి స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

అత్యంత నిష్ఠతో 'చాతుర్మాస దీక్ష'ను స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీక్ష ఎటువంటి విఘ్నాలు లేకుండా, నిరాకంటంగా, దిగ్విజయంగా పూర్తికావాలని ఆ శ్రీనివాసుడిని వేడుకున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజల శ్రేయస్సు కోసం ఆయన పడుతున్న తపన, చేస్తున్న కృషి సంపూర్ణంగా సఫలీకృతం కావాలని, అందుకు ఆ భగవంతుని కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుఖసంతోషాలతో, సుభిక్షంగా వర్ధిల్లాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. మన ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా, అత్యంత వేగంగా పుంజుకుని, ప్రజలందరి ఆకాంక్షలకు ప్రతిరూపమైన అద్భుత రాజధానిగా త్వరలోనే సాకారం కావాలని స్వామివారి పాదాల చెంత ప్రార్థించినట్లు ఆయన వెల్లడించారు. "రాష్ట్ర సంక్షేమం, ప్రజా రాజధాని నిర్మాణంపై శ్రీవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఆశిస్తున్నానన్నారు.

## బి.మఠం మండలంలో 94 శాతంతో పల్స్ పోలియో విజయవంతం



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రతి చిన్నారి నిండు జీవితానికి రెండు చుక్కల పోలియో డ్రాప్స్ వేయించాలని కూటమి నాయకులు అన్నారు. పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా కాకుమాను మండలం పరిధిలోని కొండపాటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజాన్ని స్థాపనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలనీ కోరారు. కూటమి ప్రభుత్వం వైద్య ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉందన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం లో విధులు నిర్వర్తించిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్, బీజేపీ సీనియర్ నాయకులు సజ్జనరావు, శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు గంటా నాగ జ్యోతి, రాం గోపాల్, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు తోట నాగ ఫణింద్రనాథ్, ప్రత్తిపాడు నియోజకవర్గం ఐటీడీపి అధ్యక్షులు గింజపల్లి నవీన్, యూనిట్ ఇంచార్జ్ గింజపల్లి వంశీ కృష్ణా, పొన్నం శ్రీనివాసరావు, గంటా హరిబాబు, తోట నాయుడు బాబు, తదితరులు పాల్గొన్నారు.

## 'రైతు పరిరక్షణ కమిటీ' పేరిట దాడి ఆరోపణలు..

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని ప్రాంతంలోని ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో 'సీఆర్డీయే రైతు పరిరక్షణ కమిటీ' పేరిట దాడికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో రాజకీయ వివాదం కొనసాగుతోంది. ఈ ఘటనల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తల పాత్రపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని, దేవినేని అవినాష్, మొండితోక అరుణ్, వనమా బాల వజ్రబాబు, వేమారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్లు ప్రస్తావనలోకి వచ్చాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత నేతలు బహిరంగంగా స్పందించలేదు.

ఈ ఘటనలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అనుచరులుగా చెప్పబడుతున్న ఆయన సమీప బంధువు నూనె ఉమామహేశ్వరరెడ్డి, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య పేర్లు కూడా వినిపిస్తున్నాయి. వీరిద్దరూ ఘటనలో చురుకుగా పాల్గొన్నారనే ఆరోపణలు వస్తున్నప్పటికీ, దీనిపై పోలీసులు అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

కొన్ని వర్గాల సమాచారం ప్రకారం, ఘటనకు సంబంధించిన వీడియోలు, ఇతర ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే ఈ ఘటనలో ఎవరెవరి పాత్ర ఉందనే అంశంపై దర్యాప్తు కొనసాగుతోందని చెబుతున్నారు. అయితే ఈ విషయాలపై జిల్లా పోలీసు యంత్రాంగం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ఈ ఘటన నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో పరస్పర విమర్శలు కొనసాగుతున్నాయి. రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అధికార పార్టీ నేతలు పేర్కొంటుండగా, మరోవైపు తమ నేతలను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

ఈ కేసులో వాస్తవాలు దర్యాప్తు పూర్తయ్యాకే స్పష్టమయ్యే అవకాశం ఉందని, పోలీసుల అధికారిక ప్రకటన అనంతరం తదుపరి పరిణామాలపై స్పష్టత రానుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## జూలై 14లోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయడంలో సహకరించాలి

- **ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించిన కమిషనర్ కె. మయూర్ అశోక్**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు జూలై 14 వరకు మాత్రమే గడువు ఉన్నందున ఓటర్లు, రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పూర్తి సహకారం అందించాలని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) కె. మయూర్ అశోక్ విజ్ఞప్తి చేశారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రచార శిబిరాన్ని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి జి. సాంబశివరావుతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రక్రియను సులభంగా పూర్తి చేసేందుకు ఓటర్లు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత ప్రాధాన్యమైనదని, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆదివారం నాటికి గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మొత్తం 2,52,062 మంది ఓటర్లలో 2,41,128 మందికి (95.66 శాతం) ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, 30,673 ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2,78,555 మంది ఓటర్లలో 2,72,050 మందికి (97.66 శాతం) ఫారాల పంపిణీ పూర్తిచేసి, 28,064 ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు కమిషనర్ వెల్లడించారు.

## అస్సాంలో ఏపీ బీజేపీ బిల్డింగ్ కమిటీ సమావేశం



- **పార్టీ కార్యాలయాల నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించిన పీవీఎన్ మాధవ్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అస్సాంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బీజేపీ స్టేట్ బిల్డింగ్ కమిటీ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ కార్యాలయాల నిర్మాణ పురోగతి, మౌలిక వసతుల అభివృద్ధి, భవిష్యత్ నిర్మాణ ప్రణాళికలు, నిర్మాణ ప్రమాణాల అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాతీయ బిల్డింగ్ కమిటీ కన్వీనర్, అస్సాం రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి రవీంద్ర రాజు, రాష్ట్ర బిల్డింగ్ కమిటీ కన్వీనర్ విట్ట రమేష్, కమిటీ సభ్యులు గట్టి సత్యనారాయణ, బొత్స సురేష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయాల పురోగతితో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ సంస్థాగత బలోపేతానికి ఆధునిక సౌకర్యాలతో కూడిన పార్టీ కార్యాలయాల నిర్మాణం ఎంతో కీలకమని అన్నారు. కార్యకర్తలకు శాశ్వత వేదికలుగా నిలిచేలా, పార్టీ సిద్ధాంతాలను ప్రతిబింబించేలా, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

పార్టీ కేంద్ర నాయకత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టడంతో పాటు నాణ్యత, పారదర్శకత, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిటీ సభ్యులకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాన్ని వేగవంతం చేసి, సంస్థాగత విస్తరణకు అవసరమైన మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడానికి బీజేపీ కట్టుబడి ఉందని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

## బి.మఠం మండలంలో 94 శాతం తో పల్స్ పోలియో విజయవంతం



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్ ):** పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియోలో మండలంలో 94 శాతంగా నమోదయిందని హెల్త్ సూపర్వైజర్ పుష్పరాజ్ తెలియజేశారు. మండలంలో మొత్తం 46 బూతులకు గాను 4173 మంది పిల్లలు ఉండగా అందులో ఈరోజు 3909 మంది పిల్లలకు పల్స్ పోలియో బూతులలో ఈరోజు 0 నుంచి 5 సం. రాల పిల్లలకు చుక్కలు వేసినట్లు ఆయన తెలియజేశారు. జిల్లాలోనే టాప్ టెన్ లో బి.మఠం పీహెచ్సీ ఉండడం వల్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 5 రూట్లకు గాను 198 మంది సిబ్బంది పాల్గొని ఈ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఆయన తెలియజేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లోనే మన జిల్లా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడంలో 11వ స్థానంలో ఉండడం కూడా గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు.

## ఘనంగా మొహర్రం ఉత్సవాలు



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారి మఠం మండలంలో సోమిరెడ్డిపల్లి గ్రామంలో మొహర్రం ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు పీర్లు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భాజా భజంత్రీలతో పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగిస్తు గ్రామమంతా ఆధ్యాత్మికత ఉట్టిపడేలాగా వాతావరణం ఉన్నది. ఆదివారం చివరి రోజు థౌసండ్ థౌసండ్ అంటూ అగ్నిప్రవేశం చేశారు. భక్తులందరూ స్వామివారికి ప్రసాదంగా బొరుగులు చక్కెర పూలు చల్లారు. వడ్డె రాజుల కులస్తులు గుండంతవ్వారు. స్వామివారు ఏటికి వెళ్లే సమయం తరువాత ఎత్తపు కులస్తుల వారు గుండం పూర్చి ఈ ఉత్సవాలకు ముగింపు పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కుల మతాలకతీతంగా ఘనంగా మొహరం వేడుకలు నిర్వహించుకున్నారు.

# డల్లాస్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు ఘన సన్మానం

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిసి ప్రవాస తెలుగు విద్యార్థులతో ఆత్మీయ భేటి
- "ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తల్లిదండ్రులను మరువొద్దు.. లక్ష్య సాధనలో వెనుకడుగు వేయొద్దు"
- ఎర్రబెల్లి దయాకర్ రావు



**జనగామ, జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** అమెరికాలోని డల్లాస్ నగరంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిలను అక్కడ ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా సమావేశమైన నాయకులు వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, స్వదేశంతో ఉన్న అనుబంధంపై సుదీర్ఘంగా చర్చించారు.విద్యార్థుల ఆప్యాయ స్వాగతానికి స్పందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న ప్రతి తెలుగు విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో చదివి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. విదేశాల్లో ఉన్నప్పటికీ తమ సంస్కృతి, సంప్రదాయాలు, మాతృభాషతో పాటు తల్లిదండ్రుల త్యాగాలను ఎన్నటికీ మరువకూడదని సూచించారు."మీరు ఈ స్థాయికి చేరుకోవడం వెనుక మీ తల్లిదండ్రుల ఎన్నో ఏళ్ల కష్టం, త్యాగం, ఆశయాలు ఉన్నాయి. వారి కృషిని ఎప్పటికీ మర్చిపోవద్దు. జీవితంలో ఎన్ని కష్టాలు, ఒడిదుడుకులు ఎదురైనా నిరాశ చెందకుండా మీరు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు పోరాడాలి. విజయం సాధించినప్పుడే ఆ కష్టాలన్నింటికీ విలువ ఉంటుంది" అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.అలాగే ఎంత ఉన్నత స్థానానికి చేరుకున్నా వినయం కోల్పోవద్దని, తల్లిదండ్రులు, గురువులు, స్వగ్రామం, స్వరాష్ట్రం పట్ల కృతజ్ఞతాభావంతో ఉండాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు యువత తమ ప్రతిభతో మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారని, అదే స్ఫూర్తితో మరింత కష్టపడి చదివి దేశానికి, రాష్ట్రానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు.ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా విద్యార్థులను అభినందిస్తూ, విదేశాల్లో విద్యాభ్యాసం చేస్తున్న ప్రతి తెలుగు విద్యార్థి భారతీయ విలువలను కాపాడుకుంటూ విజ్ఞానాన్ని సంపాదించాలని సూచించారు. భవిష్యత్తులో తమ జ్ఞానం, అనుభవంతో సమాజాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం వారితో ప్రత్యేకంగా సమావేశమై విద్య, ఉద్యోగ అవకాశాలు, విదేశాల్లో ఎదురయ్యే సవాళ్లు, స్వదేశాభివృద్ధిలో ప్రవాస భారతీయుల పాత్ర వంటి పలు అంశాలపై చర్చించారు.ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగగా, నాయకులు విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలియజేశారు. విదేశాల్లో ఉన్నప్పటికీ తెలుగు సంస్కృతిని, భారతీయ విలువలను ప్రపంచానికి చాటిచెబుతూ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# ఓటరు జాబితాల ఖచ్చితత్వమే ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రధాన లక్ష్యం

- ఎలాంటి అపోహలకు తావివ్వొద్దు.. ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి గడువులోగా అందజేయండి
- బచ్చన్నపేటలో ఇంటింటి సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటరు జాబితాలను మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా రూపొందించడమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ఈ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అపోహలను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.శనివారం బచ్చన్నపేట మండలంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేస్తున్న బూత్ లెవల్ అధికారుల (బీఎల్వోలు) పనితీరును పరిశీలిస్తూ, కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి, ఓటర్లకు పూర్తి వివరాలు తెలియజేస్తూ ఫారాల పంపిణీ చేపట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పలువురు కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాల ప్రాముఖ్యతను వివరించారు. ఫారంలో కోరిన ప్రతి వివరాన్ని స్పష్టంగా, తప్పులు లేకుండా నమోదు చేయాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే సంబంధిత బీఎల్వోలను సంప్రదించాలని సూచించారు. ఫారం నింపే విధానం, అవసరమైన వివరాలు, సమర్పణ గడువు వంటి అంశాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని అధికారులను ఆదేశించారు.నింపిన ఫారాలను రెండు నుంచి మూడు రోజుల్లోగా సంబంధిత బీఎల్వోలకు తిరిగి అందజేయాలని కలెక్టర్ సూచించారు.

సమయానికి ఫారాలు అందితే ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని, ఎన్నికల సంఘం రూపొందించే తుది ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో ఉంటుందని పేర్కొన్నారు.ఓటర్లలో ఎలాంటి భయాందోళనలు లేదా అపోహలు కలగకుండా బీఎల్వోలు ప్రతి అంశాన్ని ఓపికగా వివరించాలని కలెక్టర్ సూచించారు. "ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా ఎవరి పేరు అనవసరంగా తొలగించే ఉద్దేశం లేదు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, తప్పులు సరిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యం" అని ఆయన స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని పేర్కొన్న కలెక్టర్, ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేయించి ఎన్నికల ప్రక్రియలో బాధ్యతాయుతంగా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే పారదర్శకమైన, తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించడం సాధ్యమవుతుందని అన్నారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు), రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# పాలకుర్తి బస్టాండ్‌లో గంజాయి పట్టివేత

- 1.8 కిలోల గంజాయితో ముగ్గురు అరెస్ట్.. చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ దూలం పవన్ కుమార్
- మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం : ఎస్ఐ




**జనగామ, జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** జనగామ జిల్లా పాలకుర్తి బస్టాండ్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 1.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో పాలకుర్తి ఎస్ఐ దూలం పవన్ కుమార్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పాలకుర్తి బస్టాండ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తనిఖీలు నిర్వహించగా, వారి వద్ద నుంచి సుమారు 1.8 కిలోల గంజాయి లభ్యమైంది. వెంటనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ దూలం పవన్ కుమార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని ప్రజలను కోరారు.."పాలకుర్తి మండలాన్ని మాదకద్రవ్యాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉంది. ప్రజల సహకారం ఉంటేనే గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడం సాధ్యమవుతుంది. నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు" అని ఎస్ఐ స్పష్టం చేశారు. ఘటనతో పాలకుర్తి ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు మరింత నిఘా పెంచినట్లు తెలుస్తోంది.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి..



**వనపర్తి జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** జూన్ 28 న (ఆదివారం) నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లాలో జూన్ 28 న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. పల్స్ పోలియో వ్యాధి దేశంలో చాలా సంవత్సరాల క్రితమే నిర్మూలన అయినప్పటికీ, పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి వచ్చే వలసదారుల కారణంగా మళ్లీ వ్యాప్తి చెందే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. పోలియో చుక్కలు వేయించడం వల్ల ఎలాంటి హాని ఉండదని .. జిల్లాలో గుర్తించిన 46,150 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 343 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి, దాదాపు 1300 మంది వైద్య, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని .. అలాగే ప్రజలు, ప్రజాప్రతినిధులు, పత్రికా మిత్రులు అందరూ సహకరించి, భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణను విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల ధృవీకరణ చేపట్టాలి
- పెద్దవంగర, తొర్రూరు మండలాల్లో సర్పంచులు, నాయకులతో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి సమీక్ష



**జనగామ, జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పాలకుర్తి నియోజకవర్గంలోని పెద్దవంగర మరియు తొర్రూరు మండల కేంద్రాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో సర్పంచులు, పార్టీ ముఖ్యనాయకులు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, కార్యకర్తలతో విడివిడిగా నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో ఆమె మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు అని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితాకు దూరం కాకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంబంధిత బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) సమన్వయం చేసుకుంటూ ఓటర్ల వివరాల నమోదు, సవరణ, ధృవీకరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.పాలకుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు గ్రామస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని కోరారు. అలాగే మరణించిన వారి పేర్ల తొలగింపు, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత పేర్ల నమోదు, చిరునామా మార్పులు, ఇతర సవరణల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కేవలం ఎన్నికల ప్రక్రియలో భాగమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే కీలక బాధ్యత అని పేర్కొన్న ఝాన్సీ రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశాల్లో సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, మండల నాయకులు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై చర్చించారు. అలాగే మండలాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్ష నిర్వహించి, ప్రతి బూత్ స్థాయిలో పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేయాలని నిర్ణయించారు.

## ముఖ్యమంత్రితో భేటీ అయిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

- దేవరకద్రలో బ్రహ్మోస్ క్షిపణి పరిశోధన, తయారీ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర రక్షణ శాఖ సుముఖత వ్యక్తం చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి కృషికి కృతజ్ఞతలు తెలియజేసిన దేవరకద్ర శాసన సభ్యులు జియంఆర్..



**దేవరకద్ర, జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర నియోజకవర్గంలో బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ మరియు పరిశోధన యూనిట్ ఏర్పాటుకు సంబంధించి, ఇటీవల రక్షణ శాఖ మంత్రిని కలసి బ్రహ్మోస్ క్షిపణి యూనిట్ ఏర్పాటుకు కృషి చేసిన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారిని నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా త్వరితగతిన బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి గారిని మరోసారి కోరారు, బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటు వల్ల స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉన్నందున, ఈ ప్రాజెక్టు పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి గారిని కోరిన ఎమ్మెల్యే జియంఆర్.

## నర్సాపూర్ పాఠశాలకు ఇన్ఫోసిస్ 4 కంప్యూటర్ల విరాళం



**ములుగు, జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** వెంకటాపూర్ మండలం నర్సాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సాంకేతిక విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నాలుగు డెస్క్‌టాప్ కంప్యూటర్లను విరాళంగా అందజేశారు.నర్సాపూర్ గ్రామంలో జన్మించి, ఉన్నత స్థాయికి ఎదిగిన సిరుప శ్రీనాథ్ ప్రత్యేక చొరవ, సహకారంతో, తాను పుట్టిన ఊరి విద్యార్థులు ఆధునిక సాంకేతిక విద్యలో ముందుండాలనే ఆకాంక్షతో, మాతృభూమి రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ మేనేజర్ రాపాక స్వాతి, సిఎస్ఆర్ కోఆర్డినేటర్ రాపాక నాగరాజు ప్రత్యేక సహకారం అందించి కంప్యూటర్లను సమకూర్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, గ్రామ సర్పంచ్ గై రుద్రమదేవి, శ్రీ గై అశోక్ సమక్షంలో శ్రీనాథ్ రిబ్బన్ కట్ చేసి కంప్యూటర్లను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మరియు గ్రామ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభ్యసించి డిజిటల్ రంగంలో రాణించేందుకు ఈ కంప్యూటర్లు ఎంతో ఉపయోగపడతాయని హర్షం వ్యక్తం చేశారు.గ్రామీణ విద్యార్థుల సాంకేతిక విద్యాభివృద్ధికి అండగా నిలిచిన ఇన్ఫోసిస్ ప్రతినిధులు శ్రీమతి రాపాక స్వాతి , శ్రీ రాపాక నాగరాజు కి, అలాగే ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి విశేష కృషి చేసిన శ్రీనాథ్కి పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పటేటి నరేష్ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు ఠాకూర్ మంజుల,ఏళ్ళ మధుసూదన్, విమల, యాకయ్య, జగన్ మోహన్, రవీందర్ వార్డ్ సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లితండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



**వెంకటాపురం(నూగూరు), జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా శనివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మండల వ్యాప్తంగా 46 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రజలందరికీ సహాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమాదేవి, కాంగ్రెస్ నాయకులు చిడెం సాంబశివరావు, మన్యం సునీల్, ధనపునేని వెంకటేశ్వర్లు, సయ్యద్ హుస్సేన్, చిట్టెం సాయి కృష్ణ, చిట్టెం వాసు, గార్లపాటి రవి, దర్రా రవి, కొండపర్తి సీతాదేవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం

- మహబూబ్‌నగర్ జిల్లా ఉద్యమకారులంతా పాల్గొనాలి
- జిల్లా ఉద్యమకారుల సంఘం కోకన్వీనర్ నాచ శ్రీనివాస్ యాదవ్ పిలుపు



**దేవరకద్ర, జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాదులోని ఇంద్ర పార్క్ వద్ద జూన్ 28 ఆదివారం సాయంత్రం 4 గంటలకు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం కార్యక్రమం జరగనుంది. ఉద్యమకారుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పిడమర్తి రవి పిలుపుమేరకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ఉద్యమకారుల సంఘం కో కన్వీనర్ నాచ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులందరూ ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల ఆత్మగౌరవం, వారి త్యాగాల గుర్తింపు కోసం ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యమకారుల ఐక్యతను చాటేందుకు ఇది ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాచ శ్రీనివాస్ యాదవ్ కోరారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు గడ్డమీద గోపాల్, బాలన్న, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు ఘన సన్మానం

- బచ్చన్నపేట కస్తూర్బా పాఠశాల అభివృద్ధిపై సానుకూల చర్చ
- విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని వినతి



**జనగామ, జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** బచ్చన్నపేట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్‌కు బచ్చన్నపేట గ్రామ సర్పంచ్ అల్వాల నర్సింగరావు శాలువాతో ఘనంగా సన్మానించి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, విద్యా నాణ్యత పెంపు, విద్యార్థినుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌తో సుదీర్ఘంగా చర్చించారు.సమావేశంలో పాఠశాలలో విద్యార్థినులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్యం, తరగతి గదుల సౌకర్యాలు, డిజిటల్ విద్య, భద్రతా చర్యలు, క్రీడా సౌకర్యాల విస్తరణ వంటి అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా సర్పంచ్ అల్వాల నర్సింగరావు మాట్లాడుతూ, "విద్యాభివృద్ధే సమాజాభివృద్ధికి పునాది. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమైతేనే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుతుంది. గ్రామీణ ప్రాంత బాలికలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత" అని అన్నారు.జిల్లా కలెక్టర్ కూడా పాఠశాల అభివృద్ధికి అవసరమైన అంశాలను పరిశీలించి, విద్యార్థినుల సంక్షేమం, విద్యా నాణ్యత పెంపునకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అవసరమైన సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్‌కు గ్రామపంచాయతీ తరఫున ఘన స్వాగతం పలికి, పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది అవకాశవాద లాలూచి రాజకీయం

**ఖమ్మం,(జర్నలిస్ట్ ఫైల్):** భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం అక్షయ కన్వెంక్షన్ హాల్ నందు శనివారం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్,ఎమ్మెల్సీలు తాత మధుసూదన్,తక్కెళ్లపల్లి రవీందర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రక్కన ఉన్న ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తూ లాలూచి రాజకీయం చేస్తున్నారని పోలవరం ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలం పట్టణం ముంపునకు గురవుతుందని అలా జరగకుండా ముంపు నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గాలి వీచినా, ఆ గాలిని తట్టుకుని నిలబడింది ఒక్క భద్రాచలం నియోజకవర్గం మాత్రమే. సీతారామ చంద్రస్వామి దయ ఇక్కడి బిఆర్ఎస్ పార్టీపై ఉంది. కానీ కొందరు అవకాశవాదులు పదవులు పొంది, ఆ తర్వాత గోడ దూకారు. ఇవాళ వారి పరిస్థితి ఎలా ఉందంటే, అటు కాంగ్రెస్‌లోనూ ఇటు బిఆర్ఎస్‌లోనూ చెప్పుకోలేని విధంగా ఉందన్నారు. సభల్లో కాంగ్రెస్ అంటూ, స్పీకర్ దగ్గరకు వచ్చేసరికి బిఆర్ఎస్ అని చెప్పుకుంటూ తొమ్మిది మంది లాలూచీ రాజకీయాలు చేస్తున్నారు. అందులో మన భద్రాచలం ఎమ్మెల్యే కూడా ఒకరు. కండువా వేసుకోలేదని సాకులు చెప్తున్నా, రేవంత్ రెడ్డి పక్కన నిలబడి ప్రచారం చేసినప్పుడు అది ఏ పార్టీ ప్రచారమో ప్రజలందరికీ తెలుసు. నిజంగా ధైర్యం ఉంటే రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాలని నేను డిమాండ్ చేస్తున్నాను.భద్రాచలంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదు కానీ, ఇక్కడి ఎమ్మెల్యేల అభివృద్ధి మాత్రం అంబరాన్నంటింది. భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో ఇసుక దోపిడీ బహిరంగంగా సాగుతోంది. ఎడారుల్లో వచ్చే తుఫానులు ఇవాళ భద్రాచలంలో 'ఇసుక తుఫాను'లా మంత్రుల, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నడుస్తోంది. కోట్లాది రూపాయల ఇసుకను తరలిస్తూ రోడ్లన్నీ గుంతల మయం చేశారు. ఆసుపత్రికి వెళ్లే రోగులు, గిరిజన గ్రామాల ప్రజలు నడవలేని పరిస్తితి ఏర్పడింది. గిరిజన గ్రామాల్లో సొసైటీల ముసుగులో సొమ్మును దుర్వినియోగం చేస్తూ, సర్పంచులను మోసం చేస్తూ ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో మంత్రుల ఆదాయం పెరిగింది తప్ప, రాష్ట్ర ఆదాయం, ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి.కేసిఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ సాగర్ బ్యారేజ్ పనులు ఈ రెండున్నరేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. గిరిజన ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కనబెట్టింది.గతంలో గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి 6 లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు కట్టించిందో సమాధానం చెప్పాలి. గిరిజనులకు ఇచ్చిన పోడు భూముల పట్టాల విషయంలోనూ ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. మన కార్యకర్తల కష్టాన్ని కాదని కేసిఆర్ గారికి మోసం చేసిన వారికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. మన జెండాను పట్టుకుని, ప్రజా పక్షాన పోరాడటమే బిఆర్ఎస్ పార్టీ ధర్మం. జయాపజయాలు దేవుడెరుగు, కానీ ప్రజల కోసం నిలబడటం మన బాధ్యత.ఇప్పుడు కాంగ్రెస్ సినిమా 'ఇంటర్వెల్' కి వచ్చింది. సినిమా ఫ్లాప్ అయిందని వారికే అర్థమైపోయింది. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం.ఈ క్రమంలో ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ (సర్) ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా మీ ఓటును, మీ వార్డులోని ఓట్లను, మీ పార్టీ వారి ఓట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత బిఎల్ఏ (బిఎల్ఏ) లపై ఉంది.త్వరలోనే రాబోయే పార్టీ సభ్యత్వ నమోదు యాప్ పై కూడా శిక్షణా కార్యక్రమాలు ఉంటాయి.కార్యకర్తలంతా గట్టిగా శ్రమించి పార్టీని బలోపేతం చేయాలని, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండాను భద్రాచలం గడ్డపై మళ్లీ ఎగరేయాలని పిలుపునిచ్చారు.



# సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజమే

**వైరా, (జర్నలిస్ట్ ఫైల్) :** సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని, ప్రపంచ దేశాలకు శత్రువు సామ్రాజ్యవాదమేనని, గ్లోబలైజేషన్ విఫలమైందనిలోకలైజేషన్ ప్రారంభమైందని, ప్రజా సమస్యలను అధ్యయనం చేసి ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని, ప్రపంచ అభివృద్ధికి సామ్రాజ్యవాద శక్తులే నేడు అతిపెద్ద ప్రమాదంగా మారాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఏన్కూరు మండలం తిమ్మారావుపేట గ్రామంలోని మోతుకూరి గార్డెన్స్ పంక్షన్ హాల్ నందు సిపిఐ(ఎం) వైరా డివిజన్ రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు గుండాల సత్యనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ రాజకీయ తరగతులకు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా తిమ్మారావుపేట సర్పంచ్ గుగులోత్ సుమలతను శాలువా కప్పి నున్నా నాగేశ్వరరావు అభినందించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు క్లాసులను ప్రారంభించి "జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు" అంశంపై మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, దాని నుంచి బయటపడేందుకు అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాద దేశాలు యుద్ధాలు, ఆర్థిక ఆంక్షలు, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని పెంచుతున్నాయని అన్నారు. ఈ పరిణామాలు ప్రపంచ శాంతికి తీవ్ర ముప్పుగా మారాయని పేర్కొన్నారు. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోందని, కార్మిక చట్టాలను బలహీనపరుస్తోందని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే చర్యలు చేపడుతోందని విమర్శించారు. దీనివల్ల కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. ప్రజల అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు మతోన్మాదం, కులవివక్ష, ద్వేష రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పార్టీ కార్యకర్తలు రాజకీయంగా, సైద్ధాంతికంగా మరింత చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషిస్తూ ప్రజా సమస్యలపై ఉద్యమాలను నిర్మించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు... పార్టీ నిర్మాణం, ప్రజా సంఘాల బలోపేతం, కార్మిక-రైతు ఐక్యత సాధనలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. సాయంత్రం పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు పి. సోమయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి నిరంతరం ఉద్యమాలు చేపట్టాలని కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలిచ్చి రెండున్నరేండ్లు గడిచినప్పటికీ, వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. దేశంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మరోపక్క నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నా.. పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో విసిగిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, కానీ ఒక్క హామీని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను గుర్తించి ప్రజలను చైతన్యవంతం చేసి దశల వారీగా ఉద్యమాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, ఏన్కూరు, కొణిజర్ల, సింగరేణి, వైరా రూరల్, కామేపల్లి మండలాల కార్యదర్శులు దొంతెబోయిన నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, కుందనపల్లి నరెంద్ర, బాణాల శ్రీనివాసరావు, అంబటి శ్రీనివాసరెడ్డి తిమ్మరావుపేట గ్రామం సర్పంచ్ గుగులోత్ సుమలత, పార్టీ నాయకులు ఏల్పుల రాములు, ఇటికల లెనిన్, కాలసాని సాయి, రేగళ్ళ తిరుమలరావు, షేక్ జానీ, కాత్రేల బిక్షం, భూక్యా లచ్చు, డివిజన్ కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# ముదిగొండ గ్రంథాలయానికి మహర్దశ

**ఖమ్మం,(జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో గ్రంథాలయానికి మహర్దశ పట్టనుంది . తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు సహకారంతో పాత గ్రంథాలయ స్థానంలో నూతన గ్రంథాలయం నిర్మాణానికి నిధులు మంజూరైంది. ప్రభుత్వం నుంచి రెండు కుంటల స్థలం గ్రంథాలయానికి అందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో నూతన గ్రంథాలయం రూపొందించుకుంటుంది. ఖమ్మం జిల్లాలో పలు గ్రంథాలయాలను సందర్శించి గ్రంథాలయాల అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో గ్రంథాలయాలు అభివృద్ధి జరగనుంది. ఈ సందర్భంగా ముదిగొండ గ్రంథాలయానికి కేటాయించిన స్థలాన్ని నిన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా శనివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు జే భాస్కరరావు, సుమలత, శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తాం
## : వనజీవి రామయ్య సతీమణి జానమ్మ



**ఖమ్మం, జూన్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :**
పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తామని పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య సతీమణి జానమ్మ పేర్కొన్నారు. శనివారం ఖమ్మం ఐ డి ఓ సి నందు పద్మశ్రీ వనజీవి రామయ్య సతీమణి జానమ్మ చేతుల మీదుగా వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ రామమూర్తి హాజరైయ్యారు. హార్టికల్చర్ అధికారి అనితశ్రీ ఈ కార్యక్రమంలో గార్డెన్ ఇన్చార్జి హసీన బేగం, సుబ్బారావు హాజరైయ్యారు . ఈ మొక్కలు ఐడిఓసి ముందు భాగంలో వేయడం జరిగింది. ఈ మొక్కలను రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సతీమణి ఈ మొక్కల్ని ఐడిఓసికి పంపించడం జరిగింది.

# జనసేన అరకు పార్లమెంట్ కమిటీలో బేడే సతీష్‌కు ప్రత్యేక స్థానం

- చింతూరు యువకుడికి జనసేనలో కీలక గుర్తింపు
- పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు కృషి చేస్తా బేడే సతీష్

**చింతూరు, (జర్నలిస్ట్ ఫైల్) :**
జనసేన పార్టీ రాష్ట్ర నాయకత్వం అరకు పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ లో చింతూరు మండలానికి చెందిన యువ నాయకుడు బేడే సతీష్ ఎంపిక కావడం పట్ల జనసేన శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ నాగబాబు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో రంపచోడవరం నియోజకవర్గం నుండి బేడే సతీష్‌కు అవకాశం కల్పించడం ఆయన పార్టీ పట్ల చూపుతున్న అంకితభావానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బేడే సతీష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కి, ఎమ్మెల్సీ నాగబాబు కి, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల గుర్తింపు, సమాచార సేకరణలో నిజాయితీగా పనిచేస్తూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని అన్నారు. జనసేన పార్టీ అభివృద్ధి, సంస్థాగత బలోపేతంలో భాగంగా ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుందని, పార్టీ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా కృషి చేస్తానని బేడే సతీష్ పేర్కొన్నారు.




# పాత్రికేయుని మాతృమూర్తికి ఘన నివాళి
## - దశదినకర్మలో పాల్గొన్న మాజీ జడ్పీటిసి బానోత్ కొండ




**బోనకల్, (జర్నలిస్ట్ ఫైల్) :** బోనకల్ మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు రేగళ్ల శ్రీనివాసరావు మాతృమూర్తి రేగళ్ల వీరమ్మ దశదినకర్మ కార్యక్రమం శనివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జడ్పీటిసి బానోత్ కొండ రేగళ్ల వీరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రేగళ్ల వీరమ్మ నిరాడంబర జీవనం, కుటుంబ విలువలు, సమాజం పట్ల చూపిన ఆదర్శప్రాయమైన జీవన విధానం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆమె మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని, ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గుగులోతు నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పాత్రికేయులు, బంధుమిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రేగళ్ల వీరమ్మకు ఘన నివాళులర్పించారు.

# యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్..




**మియాపూర్,(జర్నలిస్ట్ ఫైల్):**సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ప్రజా షెల్టర్స్ కమిటీ హాల్, మియాపూర్ మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమాన్ని యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ , చైర్మన్, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ వి. జగదీశ్వర్ గౌడ్ మరియు వారి తనయుడు వైభవ్ కృష్ణ లు పాల్గొన్నారు. సామాజిక సేవ పట్ల అంకితభావంతో ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే సంకల్పంతో పనిచేస్తున్న యలమంచి ఉదయ్ కిరణ్, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ విశేష సేవలందిస్తున్నారు. తన సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందడమే కాకుండా, పలు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు అందుకుని తెలంగాణకు, మియాపూర్‌కు గర్వకారణంగా నిలిచారు.యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్య, ఆరోగ్యం, యువజన అభివృద్ధి, సామాజిక సంక్షేమం వంటి అనేక రంగాల్లో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, జ్యామితి బాక్సుల పంపిణీ, వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, ఉచిత తాగునీటి పంపిణీ, వృద్ధాశ్రమాల్లో పండ్ల పంపిణీ, ఉచిత మెగా మెడికల్ క్యాంపులు, వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, అనాథాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు, క్రీడా రంగం అభివృద్ధి,వికలాంగులకు అవసరమైన సామగ్రి, విద్యా సహాయం, యువతకు క్రీడా సామగ్రి, అవార్డుల పంపిణీ, వాలీబాల్, కేరమ్ బోర్డుల పంపిణీ, ఉచిత కంటి పరీక్షల శిబిరాలు, పేద విద్యార్థులకు ఫీజు సహాయం, మహిళా దినోత్సవ వేడుకలు, గ్రేస్ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు, జీహెచ్ఎంసీ కార్మికులకు ఫుడ్ డ్రైవ్, సమ్మర్ కూలింగ్ స్టేషన్ల ఏర్పాటు, అలాగే అనుబంధ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ సమాజంలో విశేష గుర్తింపు పొందుతోంది.ఈ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు మియాపూర్‌కే పరిమితం కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ప్రజల ప్రశంసలు అందుకుంటూ, సామాజిక బాధ్యత, మానవతా విలువలు, ప్రజా సంక్షేమానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.ఈ సందర్భంగా ముఖ్య అతిథి వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప సేవా కార్యక్రమమని, యలమంచి ఉదయ్ కిరణ్ సామాజిక సేవలో ముందుండటం అభినందనీయమని పేర్కొన్నారు.ఉదయ్ కిరణ్ తనకి అత్యంత సన్నిహితుడు,హృదయానికి దగ్గరైన వ్యక్తి,యువకుడు ఇలాంటి వాళ్ళు సమాజానికి ఎంతో అవసరం అని తెలిపారు.ఉదయ్ చేస్తున్న అన్ని కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని,చాలా మంది యువతకి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు ,యువ శక్తి ని ప్రోత్సహించడం మనందరికీ బాధ్యత అని,ఇలాంటి గొప్ప కార్యక్రమాలని చేపడుతున్న వ్యక్తికి అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలకు దూరమవుతున్న పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప మానవతా సేవ అని కొనియాడారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించేందుకు ఇలాంటి మెగా మెడికల్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత విస్తృతంగా ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు.అనంతరం యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, “మియాపూర్ డివిజన్ ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం. ఈ మెగా మెడికల్ క్యాంప్ ద్వారా వందలాది మందికి అవసరమైన వైద్య సేవలు అందించగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాము. మా సేవా కార్యక్రమాలకు సహకరిస్తూ, ప్రోత్సహిస్తున్న ముఖ్య అతిథులు, వైద్యులు, వాలంటీర్లు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు మరియు ప్రతి ఒక్కరికీ మా ట్రస్ట్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు” అని తెలిపారు.అలాగే మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ యాజమాన్యానికి ఉచిత వైద్య సేవలు, ఉచిత రవాణా సౌకర్యం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రజా షెల్టర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శంకర్, రెడ్డమ్మ, గోపాలకృష్ణ, శ్రీను, శ్రీనివాస్,సుబ్బరాయుడు,విజయ్ ,వెంకట్ మరియు రామకృష్ణ ల కి తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ మెగా మెడికల్ క్యాంపులో సుమారు 400 మందికి పైగా ప్రజలు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, నిపుణులైన వైద్యుల సలహాలు, అవసరమైన మందులు మరియు ఆరోగ్య మార్గదర్శకాలను ఉచితంగా పొందారు.ఈ కార్యక్రమంలో వీరమల్ల వీరేందర్ గౌడ్,నడిమింటి కృష్ణ,పట్వారీ శశిధర్ , రావిపాటి వెంకటేశ్వర్లు, ,గోవర్ధన్, డి.సాంబశివరావు,రాజు,రాజన్,శ్రీహరి,మూర్తి,భరత్, బాబ్జీ,సత్యనారాయణ, సత్య రెడ్డి, పద్మిని, శ్రీకాంత్, శరత్, నాని, సాంబయ్య, అశోక్,మధు, ఉదయ్,శ్రీరామ్,కార్తీక్,విజయభాస్కర్, నరేందర్ రెడ్డి, పద్మ, సాయి కృష్ణ, మోహన్ రెడ్డి, ఎంసీ రెడ్డి, కృష్ణ, షా, కేవీ రావు, శేఖర్, నవ్యశ్రీ, శ్రీనివాసులు, సత్యనారాయణ, రాజేష్, కార్తీక్, దినేష్, గిరి, సీహెచ్ సాంబయ్య, బాల మురళి, నవీన్, సాధన, తాండ్ర రామచంద్ర గౌడ్, వెంకటేష్, శివ ముదిరాజ్, ప్రవీణ్, నాగసాయి, వినోద్, వంశీ చౌదరి, వాసు కామినేని, సాయి నిఖిల్, రత్నచారి, మధు, శరత్, రాధాకృష్ణ, శివప్రసాద్, సర్దార్, కర్రి నాని, అశోక్, ఇరాన్ జగన్ రామస్వామి, కిరణ్, బండి రామకృష్ణ, సురేష్, సంజయ్, ధనరాజ్, ప్రశాంత్, సల్మాన్, ఆసిఫ్, కరీం, మణిక్, శేఖర్, ప్రసాద్, రఘు, వలభనేని నరసింహారావు, ప్రకాష్, సత్య, శేషగిరిరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించే దిశగా వైద్య సిబ్బంది కృషి చేయాలి.

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**భూపాలపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండల గ్రామ పంచాయతి కార్యాలయంలో మొబైల్ టిబి ఎక్స్‌రే స్క్రీనింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్క్రీనింగ్ ప్రక్రియ, లక్ష్యాల సాధనను జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, రికార్డురూముతో పాటు కార్యాలయాన్ని పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరుకున్నందున, మరమ్మత్తులు నిర్వహణకు ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్ ను ఆదేశించారు. తదుపరి బల్క్ ల్యాండ్ సర్వే ప్రక్రియపై తహసీల్దార్ ను అడిగి తెలుసుకుని, సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.అనంతరం రావులపల్లి అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులకు అందిస్తున్న వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. మాతా-శిశు సంరక్షణ రికార్డులు, మొబైల్‌లో వాక్సిన్ నమోదు చేసిన వివరాలను పరిశీలించారు.వ్యాధుల బారిన పడకుండా చిన్నారులను కాపాడేందుకు తప్పనిసరిగా వాక్సిన్ ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.మధుసూదన్, తహసీల్దార్ శ్వేతా, ఎంపిడిఓ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలను స్వాగతించిన ఎఫ్‌ఎల్‌పీసీ

**- జూనియర్ అడ్వకేట్ల సంక్షేమమే లక్ష్యం — హెల్త్ ఇన్సూరెన్స్, నెలవారీ స్టైపెండ్, కార్పస్ ఫండ్ ఏర్పాటుకు కృషి**

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్):**రాష్ట్రంలోని జూనియర్ అడ్వకేట్ల సంక్షేమం, వృత్తి భద్రత, ఆర్థిక స్థిరత్వం కోసం సమగ్ర సంక్షేమ విధానాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ డిమాండ్ చేసింది. జూనియర్ అడ్వకేట్లకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు, నెలవారీ స్టైపెండ్, తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ కార్పస్ ఫండ్ ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరింది.ఖమ్మం నగరంలోని ద్వారకానగర్ లయన్స్ క్లబ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జూనియర్ అడ్వకేట్ల సంక్షేమ అవగాహన కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు తాళ్లూరి దిలీప్ చౌదరి అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు సమన్వయం చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బిచ్చల తిరుమలరావు, మామిడి హనుమంతరావు, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండ్ జేఏసీ చైర్మన్ యడ్లపల్లి రమేష్, అడ్వకేట్స్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు, తన్నీరు లలిత తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తాళ్లూరి దిలీప్ చౌదరి మాట్లాడుతూ 2019 తర్వాత బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న జూనియర్ అడ్వకేట్లందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు, ఐదేళ్లలోపు ప్రాక్టీస్ చేస్తున్న జూనియర్ అడ్వకేట్లకు నెలవారీ స్టైపెండ్, అలాగే తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ కార్పస్ ఫండ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం దృష్టికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అడ్వకేట్ల సంక్షేమాన్ని శాశ్వతంగా బలోపేతం చేయాలంటే కార్పస్ ఫండ్ ఏర్పాటు అత్యంత అవసరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా W.P.(Civil) No.770/2026 – Sarika Tyagi vs. Union of India కేసులో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం జారీ చేసిన చారిత్రాత్మక మధ్యంతర ఆదేశాలను ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. ముఖ్యంగా యంగ్ అడ్వకేట్స్ ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫండ్, మహిళా అడ్వకేట్లకు ప్రత్యేక మౌలిక వసతులు, బార్ అసోసియేషన్లలో ప్రాథమిక సౌకర్యాల కల్పన, అడ్వకేట్ల సంక్షేమ చర్యలను బలోపేతం చేయడం వంటి అంశాలపై సుప్రీంకోర్టు చేసిన సూచనలు దేశవ్యాప్తంగా న్యాయవాదులకు ఎంతో మేలు చేస్తాయని అభిప్రాయపడ్డారు."మేము చాలా కాలంగా ప్రభుత్వం ముందు ఉంచుతున్న అంశాలనే నేడు సుప్రీంకోర్టు కూడా ప్రస్తావించడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. అడ్వకేట్ల సంక్షేమం కోసం మా పోరాటం మరింత బలోపేతంగా కొనసాగుతుంది" అని తాళ్లూరి దిలీప్ చౌదరి తెలిపారు.సీనియర్ న్యాయవాది మామిడి హనుమంతరావు ఈ-ఫైలింగ్ విధానం, సర్టిఫికేట్ ఆఫ్ వెరిఫికేషన్ రూల్స్–2015పై సమగ్ర అవగాహన కల్పించగా, కొత్త వెంకటేశ్వరరావు అడ్వకేట్స్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యత్వం, దాని ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు.జేఏసీ చైర్మన్ బిచ్చల తిరుమలరావు మాట్లాడుతూ, 2019 తర్వాత నమోదు అయిన ప్రతి జూనియర్ అడ్వకేట్‌కు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు అందే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.పెద్ద సంఖ్యలో జూనియర్ అడ్వకేట్లు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని వారు అభినందిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కోరారు. అడ్వకేట్ల సంక్షేమం, వృత్త్యాభివృద్ధి, ఆర్థిక భద్రత కోసం ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.




# మంథనిలో గౌడ్స్ కమ్యూనిటీ హాల్ రేనోవేషన్ పనులకు శ్రీకారం

**- మున్సిపల్ చైర్మెన్ ఓడ్నాల శ్రీనివాస్**



**మంథని,(జర్నలిస్ట్ ఫైల్):** మంథని మున్సిపాలిటీ పరిధిలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో నగరాభివృద్ధి నిధులు రూ. 20 లక్షలతో గౌడ్స్ కమ్యూనిటీ హాల్ రేనోవేషన్ కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ , స్థానిక కౌన్సిలర్ మద్దికట్ల స్రవంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని పట్టణాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసి, ఆదర్శ (మోడల్) మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం గౌడ సంఘం నాయకులు మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ మద్దికట్ల స్రవంతి మరియు పాలకవర్గ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గౌడ సంఘ నాయకులు, మున్సిపల్ అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్ "ప్రక్రియ ప్రోగ్రామ్ ను పర్యవేక్షించిన

## ఏంఎంసి చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



**వరంగల్ , (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ -స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులను కాంగ్రెస్ అప్రమత్తం చేసింది.ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా పురపాలక మున్సిపల్ సంస్థ పరకాల పట్టణంలోని 26 బూతులలో సర్ ప్రక్రియను, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ తరుపున ఏఎంసి పరకాల చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ఈ సర్ ప్రక్రియకు సంబంధించిన కీలక పరిణామాలను ఓటర్ల సవరణ లేదా నమోదు ప్రక్రియలో 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్,వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్,4వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, 51వ బూత్ బి ఎల్ ఏ, బొచ్చు కుమార్ ఆధ్వర్యంలో శనివారం చందుపట్ల రాజిరెడ్డి సర్ ప్రక్రియ పర్యవేక్షణపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ..సర్ ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తూ. క్షేత్రస్థాయిలో పర్యటించి, ఓటర్ల జాబితాలో పేర్లు తొలగిపోకుండా చూడాలని కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లకు (బిఎల్ఏ) స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి సులభంగా అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలన్నారు..బూత్ ఏజెంట్లు ప్రతి బూతు పరిధిలో బిఎల్ఓ తో తిరుగుతూ ప్రతి ఓటర్ ను వెరిఫికేషన్ చేయాలి.అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించాలని,అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు కూడా తొలిగిపోకుండా చూడాలి బి ఎల్ ఏ లకు సూచించారు. ఇట్టి సర్ ప్రక్రియలో నాయకులు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఒంటేరు శ్రవణ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జిలు, పోరండ్ల వేణు, సోషల్ మీడియా కోఆర్డినేటర్. గడ్డం శివకుమార్,బిఎల్ఓ కే.సునీత,హరి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పరిమళించే దిశగా "హరితో దయ" కార్యక్రమం

**హైదరాబాద్,(జర్నలిస్ట్ ఫైల్):**






చింతల్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో "స్మార్ట్ లివింగ్ – హరితో దయ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీడిమెట్ల సీఐ రామచంద్రారెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ చైతన్య పాఠశాలలు ప్రతి నెలా "స్మార్ట్ లివింగ్" కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడంతో పాటు సమాజానికి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి మాట్లాడుతూ, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించగలమని విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి, డీన్ సైదులు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ పద్మజ, అకడమిక్ కోఆర్డినేటర్లు మురళీకృష్ణ, వెంకట శివ, డీన్ సైదులు, ఏవో సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేరాలకు స్వస్తి పలకాలి

## రౌడీ షీటర్లకు పోలీసుల హెచ్చరిక



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి గుంటూరు జిల్లా పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా పోలీసు అధికారులు రౌడీ షీటర్లకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలికి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇటీవల ఒక రౌడీ షీటర్‌పై పీడీ చట్టం అమలు చేసి రాజమండ్రి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన మరో రౌడీ షీటర్‌కు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ 15 రోజుల జైలు శిక్ష విధించినట్లు వెల్లడించారు.

జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగుతోందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా పోలీసులు స్పష్టం చేశారు.

# దివ్యాంగుల ఉపకరణాల ఎంపికకు ప్రత్యేక శిబిరాలు

- జూలై 2 వరకు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో నిర్వహణ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ అందజేసేందుకు ప్రత్యేక ఎంపిక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆలింకో సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

మోకాలి పైభాగం వరకు అవయవాలు కోల్పోయిన ఆర్థోపెడిక్ దివ్యాంగులను కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ పంపిణీకి ఎంపిక చేసేందుకు జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో జూన్ 27 నుంచి జూలై 2 వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రత్తిపాడులో శిబిరం నిర్వహించగా, జూన్ 28న మంగళగిరిలో నగరపాలక సంస్థ సమీపంలోని ఈద్గా కమ్యూనిటీ హాల్‌లో శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అలాగే జూన్ 29న పొన్నూరు ఇండోర్ స్టేడియంలో, జూన్ 30న తెనాలి ప్రభుత్వాసుపత్రి సమీపంలోని చావాస్ ఫంక్షన్ హాల్‌లో, జూలై 1న తాడికొండ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో, జూలై 2న గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో ఎంపిక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అర్హులైన దివ్యాంగులు సదరం వైద్య ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, మొబైల్ నంబర్ వివరాలతో శిబిరాలకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. మరిన్ని వివరాలకు 0863-2323329 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నగర ప్రజల స్థానిక సమస్యలను సత్వరంగా పరిష్కరించే లక్ష్యంతో గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.

గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీఎంసీ విభాగాధిపతులతో కలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

నగర ప్రజలు తమ ప్రాంతాలకు సంబంధించిన తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ, రహదారులు, ఆస్తి పన్ను తదితర పౌర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులతో ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కె. మయూర్ అశోక్ కోరారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

# పిల్లల ఆరోగ్యరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే నసీర్

- పోలియో మహమ్మారిని తరిమేద్దాం
- నూరు శాతం పోలియో చుక్కలు వేయడమే లక్ష్యం
- పిల్లలకు పోలియో చుక్కలు వేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రెండు పోలియో చుక్కలు నిండు జీవితాని రక్షణగా నిలుస్తాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా స్థానిక నాజ్ సెంటర్ లోని జలగం రామారావు పాఠశాల, శారదాకాలనీలోని లూర్డు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సెంటర్లను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. పిల్లలకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పిల్లలను దేశ సంపదగా భావించాలని, వారి ఆరోగ్య పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. పోలియో మహమ్మారిని దేశం నుంచి పూర్తిగా పారదోలినప్పటికీ, పొరుగు దేశాలలో దీని ప్రభావం ఇంకా ఉందన్నారు. ప్రయాణాల్లో ఉన్న పిల్లల కోసం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లోనూ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు రాని పిల్లలను గుర్తించేందుకు సోమ, మంగళవారాల్లో ఇంటింటి సర్వే చేపడతారని చెప్పారు. ఎవరైనా మిగిలిపోతే అక్కడికక్కడే పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఇటుక బట్టీలు, నిర్మాణ స్థలాలు, మురికివాడలు, తాత్కాలిక వలస కూలీల నివాసాల్లో ఉండే పిల్లలపై ప్రత్యేక మొబైల్ టీమ్స్ దృష్టి సారిస్తాయని తెలిపారు.

**పోలింగ్ బూత్ ల పరిశీలన**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు విధులు నిర్వహిస్తున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ పరిశీలించారు. ఆయా కేంద్రాలకు వచ్చిన ఓటర్లతో ఎమ్మెల్యే మాట్లాడారు. తమ ఓటు 2002 సమయంలో ఎక్కడ ఉంది. అప్పటి ఎస్ఐఆర్ జాబితాలో చూసే విధానం, ఒక వేళ ఓటు లేకపోతే తమ కుటుంబ సభ్యుల వివరాలు ఉన్నాయో లేవో వంటి అంశాలపై వివరాలు సేకరించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా పూర్తి చేయాలనే విషయాలను ఓటర్లకు తెలియజేశారు.

ఏదైనా సందేహాలు ఉంటే బీఎల్వోల సహకారం తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. సర్ పై ఎలాంటి అపోహలు వద్దని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకే ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు.

# గంజాయి అక్రమ రవాణాదారుడిపై పీఐటీ-ఎన్ డిపీఎస్ చట్టం కింద నిర్బంధం

- మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం తప్పదన్న ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతూ ప్రజారోగ్యం, శాంతిభద్రతలకు ముప్పుగా మారిన తుళ్లూరు మండలానికి చెందిన ఓ యువకుడిపై ప్రివెన్షన్ ఆఫ్ ఇలిసిట్ ట్రాఫిక్ ఇన్ నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం-1988 కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు గుంటూరు జిల్లా పోలీసులు తెలిపారు. జిల్లా పోలీసుల ప్రతిపాదన మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవెన్యూ (ఎక్సైజ్-2) శాఖ జి.ఓ.ఆర్.టి. నెం.1109, తేదీ 24-06-2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేసి, నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధించేందుకు ఆదేశాలు ఇచ్చింది.

పోలీసుల కథనం ప్రకారం, నిందితుడు తుళ్లూరు మండలం, పరిసర ప్రాంతాల్లో తన సహచరులతో కలిసి గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడుతూ మాదకద్రవ్యాల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయించడం ద్వారా ప్రజారోగ్యానికి, సమాజ భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తున్నట్లు విచారణలో గుర్తించినట్లు వెల్లడించారు.

నిందితుడిపై ఇప్పటికే మూడు ఎన్‌డీపీఎస్ కేసులు నమోదయ్యాయి. 2021లో విశాఖపట్నం రూరల్ జిల్లా గోలుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 6.5 కిలోల గంజాయితో, 2022లో తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 500 గ్రాముల గంజాయితో, 2024లో అదే పోలీస్ స్టేషన్ పరిధిలో 151.3 గ్రాముల గంజాయితో కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పదేపదే మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఇటువంటి నేరాలను అరికట్టేందుకు పీట్-ఎన్డీపీఎస్ చట్టం కింద నిర్బంధించడం అవసరమని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయాలు లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేడు లాంలో వైభవంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

- ఖరీఫ్ సాగుకు సంప్రదాయబద్ధంగా శుభారంభం
- పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఖరీఫ్ సాగుకు శుభారంభాన్ని సూచించే సంప్రదాయ వ్యవసాయ పండుగ ఏరువాక పౌర్ణమి వేడుకలను ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జూన్ 29న లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంగణంలో వైభవంగా నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ అధ్యక్షతన ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది.

ఏరువాక పౌర్ణమి సందర్భంగా అలంకరించిన ఎడ్లతో సంప్రదాయ నాగలి పూజ, దుక్కి కార్యక్రమం నిర్వహించి ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, నారా లోకేష్, నాదెండ్ల మనోహర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ, ఏరువాక పౌర్ణమి ప్రకృతిని గౌరవించడం, వ్యవసాయ సంప్రదాయాలను పరిరక్షించుకోవడం అనే సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. పురాతన వ్యవసాయ విజ్ఞానానికి ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారానే సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నేల, నీటి వనరుల సంరక్షణతో పాటు రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

వేడుకల అనంతరం "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపకులపతి పిలుపునిచ్చారు.

## కొండపాటూరులో ఎస్ఐఆర్‌పై అవగాహన



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు ఆదేశాల మేరకు కాకుమాను మండలం కొండపాటూరు గ్రామ ఎస్సి ఏరియా పరిధి లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించడం, ఓటరు ఎనిమరేషన్ ఫార్మ్ పూర్తి చేయడం జరిగింది. కార్యక్రమంలో కొండపాటూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తోట నాగ ఫణీంద్రనాథ్ , ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు గింజుపల్లి నవీన్, యూనిట్ ఇన్చార్జి గింజుపల్లి వంశీ కృష్ణా, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈదర శరత్, జంగా మాణిక్యారావు, తమలపాకుల దైవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు-జీవితానికి ప్రాణ రక్షణ



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండల టౌన్ పరిధిలో 5 రోడ్ల కూడలిలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని 0-5 సం. రాల లోపు పిల్లలకి పోలియో చుక్కలు వేసిన టిడిపి మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

0 నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్క చిన్నారికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య సిబ్బంది జ్యోత్స్న అనురాధ భారతి శ్రీదేవి మరియు గ్రామ ప్రజలు బ్రహ్మంగారి దర్శనార్థం విచ్చేసిన భక్తులు పాల్గొన్నారు.

# చిన్నారుల అందమైన జీవనానికి రెండు పోలియో చుక్కలు

- జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీ అతుతోష్ శ్రీవాస్తవ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి పోలియో రహిత సమాజానికి అందరు కృషి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీ అతుతోష్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు.

ఆదివారం జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీ అతుతోష్ శ్రీవాస్తవ నగరపాలక సంస్థ కమీషనర్ మయూర్ అశోక్ తో కలసి స్థానిక బృందావన గార్డెన్స్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 913 కేంద్రాల్లో 4,012 మంది వ్యాక్సినేటర్ల ద్వారా 1,44,678 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. తల్లి తండ్రులు 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు ఇప్పించాలని , చిన్నారుల అందమైన జీవనానికి రెండు చుక్కలు ఎంతో ముఖ్యమన్నారు. ఈ నెల 29 మరియు 30 తేదీలలో అంగన్ వాడీ కార్యకర్తలు , ఏ ఎన్ ఎం లు, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఈ రోజు పోలియో చుక్కలు వేయించుకొనని చిన్నారులను గుర్తుంచి వారికి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. తల్లి తండ్రులు తమ పిల్లలను దగ్గరలోని పోలింగ్ వ్యాక్సినేషన్ కేంద్రాలకు తీసుకువెళ్ళి పోలియో చుక్కలు వేయించాలని కోరుతున్నానన్నారు.

నగరపాలక సంస్థ కమీషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పల్స్ పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఈ రోజు జరుపుకుంటున్నామని , ఈ కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక పరిధిలో 0 నుండి 5 సంవత్సరాల చిన్నారులకు 275 సెంటర్లలో సుమారు ఒక లక్ష డోసులు వేయడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. 0 నుండి 5 సం.ల పిల్లలకు వ్యాక్సినేషన్ వేయించడానికి దగ్గరలోని హెల్త్ సెంటర్లు , అంగన్ వాడీ కేంద్రాలు , ఆర్ టీ సీ బస్ స్టాండ్స్ , ముఖ్య కూడళ్ళలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు తీసుకువెళ్ళి రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ వేయించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. జీయంసీ పరిధిలో మొబైల్ టీమ్స్ 29 వున్నాయని, వలస కుటుంబాలు , నిర్మాణ ప్రాంతాలు , సంచార జాతుల నివాస ప్రాంతాలల్లో పర్యటించి చిన్నారులకు వ్యాక్సిన్ అందించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పోలియో రహిత గుంటూరు జిల్లాగా చేయాలని పిలుపునిస్తున్నానన్నారు. కార్యక్రమం అనంతరం హెల్త్ సెంటర్ లోని మందుల గది , ల్యాబ్ , మేల్ వార్డ్ లను పరిశీలించారు.

కార్యక్రమంలో డియం అండ్ హెచ్ ఓ డా. విజయలక్ష్మీ , జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. శ్రావణ్ బాబు , స్టేట్ నోడల్ ఆఫీసర్ డా.విజయలక్ష్మీ, డీసీయంఓ డా.సుజాత , సియం హెచ్ ఓ డా. శాంతి కళ , ఎం హెచ్ ఓ డా.ఎం. సురేష్ కుమార్ , మెడికల్ ఆఫీసర్స్ డా. గోపాల రావు, డా. ప్రియంక , డా.అబు బాకర్, డెమో సాంబి రెడ్డి, ఏ.పి. టెక్స్‌టైల్స్ అసోసియేషన్ చైర్మన్ సామినేని కోటేశ్వర రావు , మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు గారు కోరారు. వినుకొండ పట్టణములోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని చీఫ్ విప్ జీవీ గారు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. పోలియో రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. పోలియో రహిత రాష్ట్రం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. రెండు పోలియో చుక్కలతో పిల్లలను అంగవైకల్యం నుంచి కాపాడుకోవచ్చని వివరించారు. ఇంటింటికి వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు నూరు శాతం వేయించాలని వైద్యాధికాలకు సూచించారు. కార్యక్రమంలో జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఫేక్ నాయకులు ఆరాచకాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోం : తెనాలి టిడిపి నాయకులు హెచ్చరిక



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని రైతుల పరిరక్షణ కోసం అంటూ అరాచకాలు సృష్టించే వారికి తగిన గుణపాఠం చెబుతామని టిడిపి నాయకులు పలువురు హెచ్చరించారు.

ఈ సందర్భంగా తెనాలి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టిడిపి నాయకులు మహమ్మద్ కుద్దూస్, జొన్నాదుల మహేష్, ఈదర పూర్ణచంద్ లు మాట్లాడుతూ కూటమీ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న రాజధానిఅభివృద్ధిని చూసి ఓరవులేని వారు చేస్తున్న అరాచకాలను, దాడులను దౌర్జన్యాలను, ప్రజలు గమనిస్తున్నారని వారు తెలియజేశారు.

వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాజధాని అభివృద్ధికి, రాజధాని రైతుల సంక్షేమానికి చేసిన కృషి ఎంటో చెప్పాలని వారి ప్రశ్నించారు. రాజధాని రైతుల పరిరక్షణ సమితి అంటూ ఫేక్ నాయకులు కావాలని వాళ్ళు అరాచకాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోమని తెనాలి టిడిపి నాయకులు హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నాయకులు అశోకవర్ధన, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, వెంకటేశ్వరరావు, కుదరవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పూర్తిస్థాయిలో చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలు: గుత్తికొండ



- శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరంలో ఉచిత విద్యుత్ అమలును పరిశీలించిన గుత్తికొండ ధనుంజయరావు
- చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ప్రయోజనాలు అందుతున్నాయి
- ఉచిత విద్యుత్ అమలుపై కార్మికులతో మాట్లాడిన గుత్తికొండ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం పూర్తిస్థాయిలో అమలవుతోందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయరావు తెలిపారు.

ఆదివారం ధర్మవరంలోని జింక రామాంజనేయులు నిర్వహిస్తున్న చేనేత వస్త్ర పరిశ్రమను ఆయన సందర్శించి, ఉచిత విద్యుత్ అమలుపై కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకం వల్ల తమకు ప్రయోజనం చేకూరుతోందని చేనేత, పవర్‌లూమ్ కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు.

అనంతరం ఇటీవల టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన గుత్తికొండ ధనుంజయరావుతో పాటు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.వి.ఎస్. రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం కోశాధికారి తిరువీధుల కిరణ్, యువజన సంఘం అధ్యక్షుడు చొప్ప మణికంఠ, అశోక్, కార్యనిర్వాహక కార్యదర్శి దునకా కొండా, గోలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## పద్మశ్రీ పూర్ణిమా దేవి బర్మన్‌ను కలిసిన పీవీఎన్ మాధవ్



○ హర్గిలా పక్షి సంరక్షణలో ఆమె సేవలు ఆదర్శమని ప్రశంస

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అస్సాంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ పూర్ణిమా దేవి బర్మన్‌ను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె చేపడుతున్న పర్యావరణ, జీవవైవిధ్య పరిరక్షణ కార్యక్రమాల గురించి వివరాలు తెలుసుకున్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో అంతరించిపోతున్న గ్రేటర్ అడ్జుటెంట్ స్టార్క్ (హర్గిలా) పక్షి సంరక్షణ కోసం డాక్టర్ పూర్ణిమా దేవి బర్మన్ చేస్తున్న విశిష్ట కృషిని ప్రశంసించిన విషయం తెలిసిందే. 'హర్గిలా ఆర్మీ' పేరుతో స్థానిక మహిళలను భాగస్వాములను చేస్తూ పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దిన విధానంపై పీవీఎన్ మాధవ్ ఆమెతో చర్చించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంత కీలకమో డాక్టర్ పూర్ణిమా దేవి బర్మన్ సేవలు ప్రపంచానికి చాటి చెబుతున్నాయని అన్నారు. అంతరించిపోతున్న జీవజాతులను కాపాడడంతో పాటు మహిళలను పర్యావరణ ఉద్యమంలో భాగస్వాములను చేయడం ద్వారా ఆమె స్ఫూర్తిదాయకమైన నమూనాను సృష్టించారని కొనియాడారు.

అస్సాంకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన డాక్టర్ పూర్ణిమా దేవి బర్మన్‌ను అభినందించిన పీవీఎన్ మాధవ్, ఆమె సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలిచి పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణ పట్ల మరింత అవగాహన కల్పించాలని ఆకాంక్షించారు.

## వెంకయ్య నాయుడికి 'భారత్ రైజింగ్ ఇన్ ది మోదీ ఎరా' పుస్తకం బహుకరణ



○ రచయిత కిలారు దిలీప్‌ను అభినందించిన మాజీ ఉపరాష్ట్రపతి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి, రచయిత కిలారు దిలీప్ రచించిన "భారత్ రైజింగ్ ఇన్ ది మోదీ ఎరా" పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడికి మర్యాదపూర్వకంగా బహుకరించారు. ఈ సందర్భంగా పుస్తకంలోని ప్రధాన అంశాలను కిలారు దిలీప్ వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో చోటుచేసుకున్న అభివృద్ధి, పాలనా సంస్కరణలు, మౌలిక వసతుల విస్తరణ, ఆర్థిక పురోగతి, విదేశాంగ రంగంలో భారత ప్రతిష్ఠ పెంపు వంటి అంశాలను పుస్తకంలో సమగ్రంగా పొందుపరిచినట్లు తెలిపారు. పుస్తకాన్ని పరిశీలించిన వెంకయ్య నాయుడు, సమకాలీన అంశాలపై విస్తృత సమాచారంతో గ్రంథాన్ని రూపొందించినందుకు కిలారు దిలీప్‌ను అభినందించారు. దేశ అభివృద్ధి ప్రయాణాన్ని ప్రజలకు చేరువ చేసే ప్రయత్నంలో ఇటువంటి రచనలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిలారు దిలీప్ మాట్లాడుతూ, మోదీ నాయకత్వంలో భారత్ సాధించిన ప్రగతిని వాస్తవ ఆధారాలతో పాఠకులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి పుస్తకాన్ని అందజేసి ఆయన అభినందనలు పొందడం తనకు సంతోషంగా ఉందని చెప్పారు.

## జీతాలు లేక ఇబ్బంది పడుతున్న ఒకేషనల్ ట్రైనర్లు

○ న్యాయం చేయాలని మంత్రి లోకేష్‌కు అప్తా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గణపతి రావు విజ్ఞప్తి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఒకేషనల్ ట్రైనర్లు నెలల తరబడి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే జీతాలు, పెండింగ్ బిల్లులు విడుదల చేసి వారికి న్యాయం చేయాలని ఏపీ టీచర్స్ అసోసియేషన్ (అప్తా) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గణపతి రావు ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్రంలో సుమారు 2,990 మంది ఒకేషనల్ ట్రైనర్లు 11 ట్రేడ్లలో వివిధ వొకేషనల్ ట్రైనింగ్ పార్ట్‌నర్స్ (వీటీపీలు) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. అయితే వీటీపీలు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో ట్రైనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కొందరు ఉద్యోగులు పరిస్థితులను తట్టుకోలేక రాజీనామా చేస్తున్నారని, ఈ నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 మంది ట్రైనర్లు ఉద్యోగాలు వీడినట్లు వెల్లడించారు.

హర్యానా, ఢిల్లీ, అస్సాం రాష్ట్రాల్లో ఒకేషనల్ ట్రైనర్లకు నెలకు రూ. 44,950 వరకు వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రూ. 24 వేలే చెల్లిస్తున్నారని గణపతి రావు తెలిపారు. అందులోనూ 10 శాతం టిడిఎస్ మినహాయించి, మూడు నుంచి నాలుగు నెలలకు ఒకసారి మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎనిమిది వీటీపీలలో ముఖ్యంగా ఐసీఏ ఎడ్యూ స్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఆర్ఆర్ సంస్థలు మార్చి, ఏప్రిల్ నెల జీతాలతో పాటు గత ఏడాది గెస్ట్ లెక్చరర్లు, వరల్డ్ యూత్ స్కిల్ డే, స్కిల్ కాంపిటీషన్, ఇంటర్న్‌షిప్‌లకు సంబంధించిన బిల్లులు కూడా చెల్లించలేదని పేర్కొన్నారు. సమస్యలపై ప్రశ్నించిన ట్రైనర్లను విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రతి ఏడాది ఏప్రిల్ చివరి నుంచి జూన్‌లో కాంట్రాక్టు పునరుద్ధరణ వరకు వేతనాలు లేకుండా ట్రైనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గణపతి రావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని పెండింగ్ వేతనాలు, బిల్లులు విడుదల చేయడంతో పాటు థర్డ్ పార్టీ ఏజెన్సీల విధానాన్ని రద్దు చేసి ట్రైనర్లకు న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా థర్డ్ పార్టీ విధానం నుంచి విముక్తి కల్పిస్తామని లోకేష్ ఇచ్చిన హామీని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## పోలియో రహిత ఏపీయే లక్ష్యం : మంత్రి సవిత



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. విజయవాడలోని మధురానగర్ లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తో కలిసి చిన్నారులకు మంత్రి సవిత పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలియో నిర్మూలన బాధ్యత అందరిదీ అని అన్నారు. అయిదేళ్లలోపు తమ బిడ్డలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ప్రపంచంలోనే ఇండియాను అగ్రస్థానంలో నిలపాలని శ్రమిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా, భావితరాల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. రూ. 6.50 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని అన్ని సచివాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మొబైల్ పోలియో బూత్‌ల ద్వారా పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతి చిన్నారికి రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ అందించి, ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, పోలియో రహిత భారతదేశ నిర్మాణమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పోలియో నిర్మూలనపై విస్తృత ప్రచారం నిర్వహించి, తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చామని తెలిపారు. అనంతరం పలువురు చిన్నారులకు మంత్రి సవిత పోలియో చుక్కలు వేశారు.

ఈ కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ రమణ, డీఎం హెచ్ వో జె. ఇందుమతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రీతి అభిషా, జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి బి. శరత్ బాబు, జిల్లా హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. నవీన్ కుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు వై. పార్థ సారథి, కె. మధు, మధురా నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 'థాంక్యూ సీఎం సార్'...తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం కృతజ్ఞతలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ నిర్ణయంతో డీఎస్సీ-2003 ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉపాధ్యాయులను సీపీఎస్ నుంచి ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావడంపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "థాంక్యూ సీఎం సార్" కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రకాశం జిల్లాలో సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను నిలిపివేసిందని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 3,500 కోట్లకు పైగా బకాయిలను విడుదల చేశామని చెప్పారు. మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని, దీనిపై కూడా కొందరు విమర్శలు చేయడం విచారకరమని పేర్కొన్నారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలలో అధిక శాతం చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగాయని, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఉపాధ్యాయ లోకం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2003 నోటిఫికేషన్ చంద్రబాబు నాయుడు ప్రభుత్వమే జారీ చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ కల్పించడం ద్వారా డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నెం. 57 అమలుతో డీఎస్సీ-2003 ఉపాధ్యాయులందరినీ ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావడం ద్వారా రెండు దశాబ్దాలుగా ఉన్న వారి ఆకాంక్ష నెరవేరిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి పూర్ణచంద్రరావు, జిల్లా అధ్యక్షుడు అగ్రిబోయిన రాంబాబు, నాయకులు కట్టా సాంబశివరావు, ఆళ్ల సుబ్బయ్య, గోరంట్ల శ్రీనివాసరావు, సుధాకర్ రావు, నాగినేని నాగేశ్వరరావు, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తజనసంద్రంగా మారిన నెల్లూరు రొట్టెల పండుగ

○ మూడో రోజు పోటెత్తిన భక్తులు

○ ఉద్యోగం, సంతానం, వివాహ రొట్టెలకు అధిక డిమాండ్



**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్ద జరుగుతున్న బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ మూడో రోజు భక్తజనసంద్రంగా మారింది. శనివారం అర్ధరాత్రి నిర్వహించిన గంధ మహోత్సవం అనంతరం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో బారాషాహీదుల దర్శనానికి భక్తులు భారీగా బారులు తీరారు. ఉద్యోగం, సంతానం, వివాహం, ఆరోగ్యం, ఉన్నత విద్య, సొంత ఇల్లు వంటి కోర్కెల కోసం రొట్టెల మార్పిడి కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాయి.

రొట్టెల పండుగలో భాగంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దంపతులు తన సోదరుడు గిరిధర్ రెడ్డి భవిష్యత్తులో ఎమ్మెల్యేగా ఎన్నిక కావాలని కోరుతూ రొట్టె విడిచారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మరో రొట్టె స్వీకరించినట్లు తెలిపారు. లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.

రొట్టెల పండుగలో కోరికలు తీరాలని కోరుకునే భక్తులు స్వర్ణాల చెరువులో స్నానం చేసి మొక్కులు చెల్లించుకుంటారు. కోరిక నెరవేరిన అనంతరం తిరిగి వచ్చి రొట్టెలను పంచడం దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం. సంపద, ఉద్యోగం, విద్య, వివాహం, సంతానం, ఆరోగ్యం తదితర కోర్కెలకు అనుగుణంగా రొట్టెలను తీసుకోవడం, కోరిక నెరవేరిన తర్వాత మళ్లీ రొట్టెలు పంచడం ఈ పండుగ ప్రత్యేకతగా నిలుస్తోంది. భక్తులు బారాషాహీదులకు గలేఫ్‌లు, పూల చద్దర్లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. దర్గా పరిసరాలు, ఘాట్లు, పార్కింగ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయడంతో పాటు బారికేడ్లు ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయగా, స్వర్ణాల చెరువులో సోమశిల జలాశయం నుంచి నీటి మట్టాన్ని పెంచారు. రోజుకు మూడు సార్లు బ్లీచింగ్, క్లోరినేషన్ నిర్వహిస్తున్నారు. 24 గంటలపాటు వైద్య బృందాలు, 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచగా, రైల్వే స్టేషన్, బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నారు. మహిళల కోసం ప్రత్యేక స్నానాల టెంట్లు, జల్లు స్నానాల ఏర్పాట్లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు.

## రూ.6.57 కోట్లతో సెకండరీ ఆసుపత్రులకు 177 మార్చురీ ఫ్రీజర్ ఛాంబర్లు

○ 119 కమ్యూనిటీ, 49 ఏరియా ఆసుపత్రులకు కొత్త ఫ్రీజర్ ఛాంబర్లు

○ సెకండరీ ఆసుపత్రుల్లో మార్చురీ సౌకర్యాల విస్తరణ

○ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సెకండరీ ప్రభుత్వాసుపత్రుల్లో రూ. 6.57 కోట్ల రూపాయల వ్యయంతో కొత్తగా 177 మార్చురీ ఫ్రీజర్ ఛాంబర్లను కూటమి ప్రభుత్వం సమకూరుస్తోంది. ఒక్కొక్క దానికి రూ. 3.71 లక్షల వరకు వ్యయంచేసింది. ఒక్కో ఛాంబరులో రెండు మృతదేహాలను భద్రపరిచే సౌకర్యాన్ని కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు చేసుకున్న వారి మృతదేహాలను శవ పరీక్ష (పోస్టుమార్ధం) నిమిత్తం ప్రభుత్వాసుపత్రుల్లోని మార్చురీ గదికి తెస్తారు. అలాగే.. గుర్తుతెలియని మృతదేహాలను కూడా మార్చురీ గదుల్లోని ఫ్రీజర్ బాక్సుల్లో భద్రపరుస్తారు. చాలా ఆసుపత్రుల్లో కాలం చెల్లిన ఫ్రీజర్లు ఉన్నందున రకరకాల సమస్యలు నెలకొన్నాయి. వీటిని పరిష్కరించే చర్యల్లో భాగంగా 119 కమ్యూనిటీ ఆసుపత్రులు, 49 ఏరియా ఆసుపత్రులు, 8 జిల్లా అసుపత్రులకు కొత్తగా 117 మార్చురీ ఫ్రీజర్ ఛాంబర్లను పంపిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇప్పటివరకు 150 ఫ్రీజర్ల వం-కు అసుపత్రులకు పంపామని తెలిపారు. త్వరలో మిగిలిన వాటిని కూడా పంపిస్తామని చెప్పారు. ఫ్రీజర్ల అమరికకు తగ్గట్లు మార్చురీ గదుల సదుపాయాలు కూడా కల్పిస్తున్నామని చెప్పారు. మార్చురీ ఫ్రీజర్ ఛాంబర్ల తరలింపు, తీసుకుంటున్న చర్యల గురించి చక్రధర్ బాబు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు నివేదించారు.

## చిన్నారుల ఆరోగ్యానికి భద్రతా కవచం పోలియో చుక్కలు



**మోపిదేవి(జర్నలిస్ట్ ఫైల్):** పిల్లలకు పోలియో చుక్కలు వారి ఆరోగ్యానికి భద్రత కవచం లాంటిదని ఎస్సీ,ఎస్టి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బాబు తెలిపారు. మోపిదేవి కాలనీలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రంలో సురేష్ బాబు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు పౌరులైన చిన్నారుల ఆరోగ్య భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు అందరికీ అత్యంత సురక్షితమైన పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. తద్వారా సమాజాన్ని పోలియో రహితంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సురేష్ బాబు పండ్లను అందజేశారు.

## భావనపాడు బీచ్‌లో విషాదం.. ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి

**భావనపాడు (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీకాకుళం జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. సరదాగా గడిపేందుకు సముద్ర తీరానికి వెళ్లిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు అలల తాకిడికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన భావనపాడు తీరంలో, స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆదివారం సెలవు దినం కావడంతో టెక్కలి సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులు స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు భావనపాడు బీచ్‌కు వెళ్లారు. అక్కడ సముద్రంలో దిగి ఆడుకుంటుండగా, ఒక్కసారిగా వచ్చిన పెద్ద అలల తాకిడికి ఇద్దరు విద్యార్థులు నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. సముద్రంలో మునిగి మృతిచెందిన విద్యార్థులు జి. అగస్తీమ(19), ఎస్. యశ్వంత్(18) ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఐటీ, సీఎస్ఈ విభాగాల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులుగా గుర్తించారు. సెలవు రోజున స్నేహితులతో కలిసి ఆనందంగా గడపడానికి వెళ్లిన విద్యార్థులు ఇలా శవాలై తేలడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తోటి విద్యార్థుల మరణంతో సదరు కళాశాలలో విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యోగుల నమ్మకానికి నిలువెత్తు రూపం 'ఏపీ ఎన్జీజీవో సంఘం'

○ ఎన్జీజీవో సంఘంకు కె.జగదీశ్వరరావు సేవలు చిరస్మరణీయం

○ ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన అజెండా.

○ ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం ఎ పి ఎన్ జి జి ఓ సంఘమని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏపీ ఎన్జీజీవో పనిచేస్తోందని.. ఇలాంటి సంఘంలో కీలక పాత్ర పోషిస్తూ కె. జగదీశ్వరరావు ప్రత్యేక ముద్ర వేశారని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ అన్నారు.

ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి కె. జగదీశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా ఆదివారం విజయవాడ పటమటలోని జ్యోతి కన్వెన్షన్‌లో ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరై జగదీశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, జలవనరుల శాఖలో టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూనే, ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కె. జగదీశ్వరరావు అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. సంఘ బలోపేతం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వంతో చర్చలు, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యోగుల సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో సంఘం చేస్తున్న కృషి వెనుక జగదేశ్వర రావు సేవలు మరింత తోడ్పాటును అందించాయని అన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి చేస్తున్న కృషిలో భాగంగా గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వంతో నిర్మాణాత్మక చర్చలు జరిపి పలు కీలక సమస్యల పరిష్కారంలో సంఘం విజయవంతమైన పాత్ర పోషించిందని విద్యాసాగర్ తెలిపారూ., మెమో-57 ప్రకారం 2004కు ముందు నోటిఫికేషన్ పొందిన పోస్టులపై నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు దిశగా ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునేలా సంఘం నిరంతర కృషి చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీలలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచడం ఉద్యోగులకు ఎంతో మేలు చేసిన నిర్ణయమని పేర్కొన్నారు.

వివిధ శాఖల ఉద్యోగుల సర్వీస్ అంశాలు, పదోన్నతులు, బదిలీలు, పదవీ విరమణ ప్రయోజనాలు, ఇతర పరిపాలనా సమస్యల పరిష్కారానికి సంఘం ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతూ ఫలితాలు సాధించిందన్నారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనలో సంఘం రాజీలేని వైఖరితో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల ఐక్యతే సంఘానికి బలమని, భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమం, సేవా భద్రత, పెన్షన్, వేతనాలు, పదోన్నతులు, పదవీ విరమణ ప్రయోజనాలు సహా అన్ని అంశాల్లో ఏపీ ఎన్జీవో సంఘం చిత్తశుద్ధితో పనిచేస్తుందని విద్యాసాగర్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కె. జగదీశ్వరరావు అందించిన విశిష్ట సేవలను సభలో పాల్గొన్న నాయకులు, ఉద్యోగులు ప్రశంసిస్తూ, ఆయన పదవీ విరమణ అనంతరం కూడా సంఘానికి మార్గదర్శకుడిగా కొనసాగాలని ఆకాంక్షించారు..

కార్యక్రమం లో విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు జలవనరుల శాఖ డిప్యూటీ ఈ ఎన్ సి మల్లిఖార్జునరావు సిఈ వై. శ్రీనివాసరావు ఏపీ ఎన్ జి ఓ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి విరమణ, మాజీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు పి. అశోక్ బాబు,.. కె వి శివారెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యుల భారతి ప్రసాద్ బి. జానకి సుబ్బారెడ్డి శివప్రసాద్ రంజిత్ నాయుడు రజనీష్ జానీ భాషా ఆలిండియా ఉమెన్ వింగ్ కన్వీనర్ రాజ్య లక్ష్మి జలవనరుల శాఖ టెక్నికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమయాజులు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి హెచ్ శ్రీనివాసరావు కోశాధికారి సరస్వతి పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు జగదీశ్ సేవలను కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి కార్యదర్శి రమేష్ నగర అధ్యక్షుడు సి వి ఆర్ ప్రసాద్ వివిధ జిల్లాల అధ్యక్షకార్యదర్శులు వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467